www.vishalabharati.com
epaper:vishalabharati.com

బుధవారం, హైదరాబాద్
27.12.2023
సంపుటి:2 సంచిక:67

# విశాల భారతి

తెలుగు దిన పత్రిక

## మూడు నేర న్యాయ బిల్లులకు
# రాష్ట్రపతి ఆమోదం



**విశాలభారతి,నేషనల్ బ్యూరో:**
పార్లమెంట్ ఆమోదించిన మూడు నేర న్యాయ బిల్లులకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోదం తెలిపారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్షా సంహిత, భారతీయ సాక్ష్య బిల్లులకు ఆమోద ముద్ర వేశారు. దీంతో IPC, CrPC స్థానంలో భారతీయ చట్టాలు వచ్చినట్లైంది. ఇండియన్ పీనల్ కోడ్(ఐపీసీ), క్రిమినల్ ప్రొసీజర్ కోడ్(సీఆర్పీసీ), ఎవిడెన్స్ యాక్టకు ప్రత్యామ్నాయంగా ఈ మూడు బిల్లులను కేంద్ర ప్రభుత్వం వర్షాకాల సమావేశాల్లో పార్లమెంట్లో ప్రవేశ పెట్టిన విషయం తెలిసిందే. వీటిపై

..మిగతా 2 లో



## ప్రధాని మోదీతో..
# సీఎం రేవంత్, 'భట్టి' భేటీ

- తెలంగాణ ఆర్థిక పరిస్థితులు ప్రధాని దృష్టికి..
- రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్‌ఫండ్స్, గ్రాంట్లపై చర్చ
- కాకతీయ జౌళి పార్క్‌ను బ్రౌన్‌ఫీల్డ్‌గా ప్రకటించాలి
- పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని విజ్ఞప్తి

**విశాల భారతి, న్యూఢిల్లీ:**
ఢిల్లీలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క భేటీ అయ్యారు. రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. హస్తిన పర్యటనకు వెళ్లిన తెలంగాణ సీఎం , డిప్యూటీ సీఎం తెలంగాణకు సంబంధించిన పలు అంశాలను ప్రధాని దృష్టికి తీసుకెళ్లారు. కేంద్రం నుంచి తెలంగాణకు రావాల్సిన పెండింగ్ నిధులు, గ్రాంట్లను విడుదల చేయాలని కోరారు. రాష్ట్రంలోని పలు ప్రాజెక్టుల పరిస్థితుల గురించి కూడా మోదీకి తెలిపారు. ప్రధానంగా పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించటంపై విజ్ఞప్తి చేశారు. ఈ భేటీ అరగంటపాటు కొనసాగింది. ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్న తర్వాత రేవంత్ రెడ్డి ప్రధాని మోదీని కలవటం ఇదే తొలిసారి. ప్రస్తుతం ఢిల్లీలోనే ఉన్న రేవంత్ రెడ్డి, భట్టి విక్రమార్క 'హస్తం' పెద్దలను కలవనున్నారు. రాష్ట్రంలోని నామినేటెడ్ పోస్టుల భర్తీతో పాటు మంత్రివర్గ విస్తరణపై చర్చించే అవకాశం ఉంది. ఇక లోక్ సభ ఎన్నికలు, అభ్యర్థుల ఎంపిక వంటి అంశాలు కూడా చర్చకు వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

**ప్రధానితో చర్చించిన అంశాలు..**

- పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కోరారు.
- ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం 2015 నుంచి 2021

..మిగతా 2 లో

# ముందస్తుకు మోదీ ప్లాన్?



- మే 30 తో ముగియనున్న పదవీ కాలం..
- ఫిబ్రవరి నెలాఖరున షెడ్యూల్!
- మార్చిలో లోక్ సభ ఎన్నికలు?
- ఆపరేషన్ ప్రారంభించిన బీజేపీ
- దక్షిణ భారతంపై కాంగ్రెస్ ఫోకస్
- కసరత్తు ప్రారంభించిన బీఆర్ఎస్

> ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో 3 రాష్ట్రాల్లో విజయం సాధించిన బీజేపీ గడవు కంటే నెలరోజుల ముందే లోక్‌సభ ఎన్నికలు నిర్వహించాలని యోచిస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో వచ్చే ఏడాది మార్చిలో లోక్ సభ ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఫిబ్రవరి నెలాఖరు నాటికి కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. వాస్తవానికి ప్రధాని మోదీ ప్రభుత్వం పదవీకాలం మే 30 తో ముగియనుంది. కానీ ముందస్తుకు ఎన్నికలకు వెళ్లాలని కేంద్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఫిబ్రవరి నెల 20వతేదీ లోపు ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి మార్చి 7 నుంచి పది దశల్లో సార్వత్రిక ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ఎన్నికల కమిషన్ యోచిస్తున్నట్లు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి.

**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**

**ఎన్నికలకు సన్నాహాలు?**
అలా త్వరగా ఎన్నికలు జరిగితే తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో మార్చి 10, 15 తేదీల మధ్య పోలింగ్ జరిగే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. 17వ లోక్ సభ గడువు 2024 జూన్ 16వ తేదీతో ముగియనుంది. దీంతో మార్చి నెలలో ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసి, ఏప్రిల్, మే నెలల్లో ఎన్నికలు నిర్వహించాలి. గత 2019 లో లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ మార్చి 10న విడుదలైంది. గతంలో ఏప్రిల్ 11 నుంచి మే 19 వతేదీ వరకు ఏడు దశల్లో ఎన్నికలు జరిగాయి. ఏప్రిల్ తర్వాత ఎండలు మండిపోయే అవకాశం ఉంది. అక్కడక్కడా తాగునీటి సమస్యలు తలెత్తవచ్చని అది కాస్తా ఓటర్లపై ప్రభావం చూపవచ్చని కేంద్రం భావిస్తున్నట్టు తెలుస్తోంది. ఇందులో భాగంగానే కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఈ నెల 28న హైదరాబాద్ కు వస్తున్నారు. తెలంగాణలో డబుల్ డిజిట్ సీట్లు దక్కించుకోవడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేయనున్నారని సమాచారం. ఇందుకోసం బీజేపీ 90 రోజుల ప్రణాళికను సిద్ధం చేసుకుంటున్నది. మరో వైపు బీఆర్ఎస్ పార్టీ కూడా పార్లమెంటు ఎన్నికలకు సిద్ధమవుతున్నది. ఇందులో భాగంగా ఆ పార్టీ సోమవారం చేవెళ్ల, మంగళవారం మహబూబ్ నగర్ పార్లమెంటు సెగ్మెంట్ల లీడర్లతో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశం నిర్వహించారు. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు.
మరో వైపు అధికార కాంగ్రెస్ పార్టీలోనూ అసెంబ్లీ ఎన్నికల గెలుపు ఉత్సాహం కంటిన్యూ అవుతోంది. మార్చి 16 నాటికి ఆరు గ్యారెంటీలను అమలు చేసి ప్రజలతో శభాష్ అనిపించుకొని ముందడుగు వేయాలని భావిస్తున్నది. ఇందుకోసం ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించింది. దక్షిణ భారతంలో పట్టు పెంచుకున్న కాంగ్రెస్ ఏపీలోనూ పాగా వేసేందుకు ప్రయత్నాలను ప్రారంభించింది. ఇందుకోసం ఏకంగా ఏఐసీసీ పెద్దలు రంగంలోకి దిగడం గమనార్హం.

**ఏపీలో వైసీపీ, టీడీపీలు సమాయత్తం**
జనరల్‌గా షెడ్యూల్ ప్రకారం 18వ లోక్ సభ ఎన్నికలు ఏప్రిల్, మే నెలల్లో జరగాలి. కానీ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఛత్తీస్ ఘడ్, మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లో బీజేపీ విజయ దుందుభి మోగించడంతో కమలనాథులు ముందస్తు ఎన్నికలు నిర్వహించాలని ఉత్సాహపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో పార్లమెంటుతోపాటు అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరగనున్నందున వైసీపీ, టీడీపీలు ఎన్నికలకు సమాయత్తం దిశగా పావులు కదుపుతున్నాయి. ఏపీలో అసెంబ్లీ

..మిగతా 2 లో

## కొత్త కార్డులపై మార్గదర్శకాలు రూపొంచలేదు

- 6 గ్యారెంటీలు అమలు చేసి తీరుతాం
- మంత్రి శ్రీధర్ బాబు క్లారిటీ



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక తమ మార్క్ పాలన కోసం మార్పులు చేపట్టింది. ఇదివరకే రెండు గ్యారంటీలకు సంతకాలు చేసి అమలు చేస్తున్నారు. మరోవైపు ప్రజా పాలన అందించే ప్రభుత్వం తమది అంటూ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు చెబుతున్నారు. ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు ముందుగా రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డులు జారీ చేయడానికి ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. అయితే రేషన్ కార్డుల జారీకి విధివిధానాలు ఖరారు చేయలేదని, కసరత్తు చేపట్టామని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. రేషన్ కార్డులకు నిబంధనలు ఇవేనంటూ ప్రచారం జరగడంతో మంత్రులు ఈ విషయంపై క్లారిటీ ఇచ్చారు. తమ ప్రభుత్వం

..మిగతా 2 లో




..మిగతా 2 లో

## బీఆర్ఎస్ పాలనలో ఏ వర్గానికీ న్యాయం జరగలే

- విధ్వంసమైన తెలంగాణను గాడిలో పెడుతున్నాం
- 400 ఎకరాల ఫామ్ హౌజ్‌కోసమే కేసీఆర్ పనిచేశారు
- త్వరలోనే బీఆర్ఎస్ దోపిడీ పత్రం రిలీజ్ చేస్తం
- మంత్రులు కోమటిరెడ్డి, తుమ్మల, ఉత్తమ్

..మిగతా 2 లో

## 20 ఏళ్లలో సింగరేణి మూతపడే ప్రమాదం

- సింగరేణి ఎన్నికలతో రాజకీయ పార్టీలకు సంబంధం లేదు
- కాంగ్రెస్, సీపీఐకి మధ్య తగువులు లేవు
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
సింగరేణి ఎన్నికలతో రాజకీయ పార్టీలకు సంబంధం లేదని, ఈ విషయంలో కాంగ్రెస్, సీపీఐకి మధ్య తగువులు లేవని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు స్పష్టంచేశారు. మంగళవారం రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. తాను సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడిగా ఉన్నందునే దాని గురించి మాట్లాడుతున్నట్లు తెలిపారు. పోటీ చేస్తున్న ఏఐటీయూసీ, టీఎన్‌టీయూసీలకు కమ్యూనిస్టు పార్టీ, కాంగ్రెస్ కొంత అనుబంధం ఉందన్నారు.
గతంలో శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పొత్తు ఉన్నప్పటికీ వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు కూడా ఐఎన్‌టీయూసీ, ఏఐటీయూసీ విడివిడిగా పోటీ చేశాయని, అలాగే టీడీపీతో పొత్తు ఉన్నా సీఎంగా చంద్రబాబు ఉన్న సమయంలో టీఎన్‌టీయూసీ, ఏఐటీయూసీలు వేర్వేరుగానే పోటీ చేశాయని గుర్తు చేశారు. ఇటీవల శాసనసభ ఎన్నికల్లో సింగరేణి కార్మికులు విస్తరించిన నియోజకవర్గాలలో ఎక్కువ స్థానాల్లో కాంగ్రెస్ మంచి మెజారిటీ వచ్చేందుకు కార్మికులు, ఏఐటీయూసీ, సీపీఐ కృషి కూడా కారణమని చెప్పారు. మరోవైపు మరో 15 నుంచి 20 ఏళ్లలో సింగరేణి కాలరీస్ మూతపడే దుస్థితిలో ఉన్నదని కూనంనేని ఆందోళన వ్యక్తం చేశారు.

# లోక్‌సభ ఎన్నికల్లోను కాంగ్రెస్ దే హవా

- బీఆర్ఎస్‌కు బిగ్ షాక్
- ఏబీపీ–సీ ఓటర్ సర్వే ఓపీనియన్ పోల్ విడుదల
- కాంగ్రెస్ పార్టీకి 9 నుంచి 11 స్థానాలు
- బీఆర్ఎస్‌కు 3 నుంచి 5 సీట్లు



**విశాలభారతి,స్టేట్ బ్యూరో:**
లోక్‌సభ ఎన్నికలకు తెలంగాణలోని ప్రధాన పార్టీలు సిద్ధమవుతున్నాయి. కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ పార్టీలు కసరత్తు మొదలు పెట్టాయి. వచ్చే ఫిబ్రవరి లేదా మార్చి నాటికి ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. అయితే రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో భారీ దెబ్బతిన్న బీఆర్ఎస్ పార్టీకి.. లోక్‌సభ ఎన్నికల్లోనూ మరోసారి షాక్ తగిలేలా ఉంది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఫలితాలే మళ్లీ రిపీట్ అయ్యేలా కన్పిస్తున్నాయి. లోక్‌సభ ఎన్నికలపై ఏబీపీసీ ఓటర్ సర్వే ఓపీనియన్ పోల్ తాజాగా విడుదల చేసింది. రాష్ట్రంలో ఉన్న 17 లోక్‌సభ నియోజకవర్గాల్లో.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ పార్టీ 9 నుంచి 11 స్థానాలను గెలుచుకుంటుందని ఈ ఒపీనియన్ పోల్ తేల్చి చెప్పింది. బీఆర్ఎస్ 3 నుంచి 5 సీట్లల్లో మాత్రమే గెలుస్తుందని ఏబీపీ సీ ఓటర్ అభిప్రాయపడింది. బీజేపీ పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని తేలింది. బీజేపీకి ఒకటి నుంచి మూడు స్థానాలు మాత్రమే లభిస్తాయని పేర్కొంది. ఇతరులకు 1 నుంచి 2 సీట్లు వచ్చే ఛాన్స్ ఉందని నివేదిక ఇచ్చింది. మొత్తం మీద కాంగ్రెస్ పార్టీకి 38 శాతం మేర ఓట్లు పోల్ అవుతాయని వివరించింది.

**తెలంగాణలో బీజేపీకి కష్టమే..!**
తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు బ్యాంకు సంపాదించుకున్న బీజేపీకి ఎంపీ ఎన్నికల్లో కాస్త నిరాశే ఎదురుకానుంది. వచ్చే

..మిగతా 2 లో

**బీఆర్ఎస్‌పై ఒత్తిడి!**

అసెంబ్లీ ఫలితాల విషయంలో బీఆర్ఎస్ నేతలు ఇంకా ఒత్తిడిలోనే ఉన్నారు. కాస్త రిలాక్స్ అయ్యి ఎంపీ ఎన్నికల్లో సన్నాహకాలు రెడీ చేసుకుందామనుకునే సరికి తాజాగా విడుదలైన సర్వే వారికి షాకిచ్చింది. దీంతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎంపీ ఎన్నికలపై మరింత ఫోకస్ పెంచారు. ఈ క్రమంలోనే నియోజకవర్గాల వారీగా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి గల కారణాలను తెలుసుకుంటున్నారు.

## ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే..
# మంచిరెడ్డి కిషన్‌రెడ్డిపై కేసు నమోదు

- ఆయన కుమారుడు, మాజీ కలెక్టర్‌పై కూడా..
- మున్సిపల్ కమిషనర్ ఫిర్యాదు మేరకు నమోదు



**విశాల భారతి, స్టేట్ బ్యూరో:**
ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ బెదిరింపుల కేసు నమోదు అయ్యింది. కిషన్ రెడ్డితో పాటు ఆయన కుమారుడు ప్రశాంత్ రెడ్డి, రంగారెడ్డి జిల్లా మాజీ కలెక్టర్ ఆమోయ్ కుమార్, ఇబ్రహీంపట్నం మున్సిపల్ మాజీ కమిషనర్ ఎండీ యూసఫ్‌పై 504, 506 సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. మున్సిపల్ కమిషనర్ కప్పరి స్రవంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఇబ్రహీంపట్నం పోలీసులు

..మిగతా 2 లో



# తెలంగాణలో రెండు కరోనా మరణాలు

- ఉస్మానియాలో ఇద్దరు రోగులు మృతి
- కరోనా పాజిటివ్‌గా వైద్యులు నిర్ధారణ

**విశాలభారతి, హైదరాబాద్:** దేశ వ్యాప్తంగా కరోనా మళ్లీ అలజడి సృష్టిస్తోంది. గత 24 గంటల్లో దేశవ్యాప్తంగా 116 కేసులు నమోదు కాగా ముగ్గురు మృతి చెందారు. దేశంలో ప్రస్తుతం 4,170 యాక్టివ్ కేసులు ఉన్నాయి. కొవిడ్ సబ్ వేరియంట్ జేఎన్.1 కేసులు 69కి చేరాయి. కాగా.. తెలంగాణలో సైతం కరోనా మహమ్మారి విస్తరిస్తోంది. హైదరాబాద్లోని ఉస్మానియా ఆస్పత్రిలో కరోనా కారణంగా ఇద్దరు రోగులు మృతి చెందారు. ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధితో బాధపడుతూ ఉస్మానియా ఆస్పత్రిలోని ఎమర్జెన్సీలో చేరిన వ్యక్తి చికిత్స పొందుతూ చనిపోయాడు. మరో వ్యక్తి కూడా తీవ్ర అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చేరాడు. అతను కూడా చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయాడు. కాగా.. ఆ ఇద్దరు రోగులకు కరోనా పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ అని తేలింది. ఇద్దరు రోగులు కూడా తీవ్ర అనారోగ్యంతో ఆస్పత్రిలో చేరినట్లు ఆస్పత్రి సుపరిండెంట్ నాగేంద్ర పేర్కొన్నారు. ప్రస్తుతం తెలంగాణలో 55, ఏపీలో 29 యాక్టివ్ కేసులు ఉన్నట్టు సమాచారం. కరోనా కేసులు పెరుగుతున్న తరుణంలో... దేశ వ్యాప్తంగా నైట్ కర్ఫ్యూ విధించే అవకాశాలు ఉన్నాయనే వార్తలు కూడా వినిపిస్తున్నాయి. అంతేకాకుండా.. ఉస్మానియా ఆసుపత్రిలో ఇద్దరు పీజీ డాక్టర్లు కూడా కరోనా బారిన పడినట్లు తేలింది.

# ప్రధాని మోదీతో.. సీఎం రేవంత్, 'భట్టి' భేటీ

మొదటిపేజీ తరువాయి

వరకు ప్రతి ఏటా రూ.450 కోట్లు చొప్పున రూ.2250 కోట్లను కేంద్రం విడుదల చేసింది. 201920, 2122, 2223, 23-24 సంవత్సరాలకు సంబంధించి పెండింగ్ గ్రాంట్లు రూ.1800 కోట్లు విడుదల చేయాలని ప్రధానమంత్రిని కోరారు.

- పెండింగ్‌లో ఉంచిన 15వ ఆర్థిక సంఘం నిధులు రూ.2233.54 కోట్లు (202223కు సంబంధించి రూ.129.69 కోట్లు, 202324కు సంబంధించి రూ.1608.85 కోట్లు) వెంటనే విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు.
- రాష్ట్రంలో 14 రహదారులను జాతీయ రహదారులుగా అప్‌గ్రేడ్ చేయాలని ప్రతిపాదనలు పంపించాం. అందులో కేవలం రెండింటికే ఆమోదం తెలిపారు. మిగతా 12 రహదారుల అప్‌గ్రేడ్‌నకు ఆమోదం తెలపాలి.
- ములుగులోని గిరిజన విశ్వవిద్యాలయం ఏర్పాటుకు కేంద్రం ఆమోదం తెలిపింది. 202324 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు అనుమతి ఇవ్వాలి.
- ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం ప్రకారం పూర్వ ఖమ్మం జిల్లాలో ఉక్కు కర్మాగారం (బయ్యారం స్టీల్ ప్లాంట్) ఏర్పాటుకు కేంద్రం హామీ ఇచ్చినందున దానిని వెంటనే నెరవేర్చాలి.
- కాజీపేటలో కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాల్సి ఉండగా పీరియాడికల్ ఓవర్‌హాలింగ్ వర్క్‌షాప్ ఏర్పాటు చేస్తామని రైల్వే శాఖ ప్రకటించింది. దానికి అదనంగా కోచ్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలి.
- 2010లో నాటి కేంద్ర ప్రభుత్వం బెంగళూర్, హైదరాబాద్‌లకు ఐటీఐఆర్‌ను ప్రకటించింది. కానీ 2014లో కేంద్రంలో ప్రభుత్వం మారిన తర్వాత హైదరాబాద్ ఐటీఐఆర్‌ను పక్కనపెట్టారు.. హైదరాబాద్ ఐటీఐఆర్‌ను వెంటనే పునరుద్ధరించాలి.
- పీఎం మిత్ర కింద గుర్తించిన ఏడు మెగా జౌళి పార్కుల్లో వరంగల్‌లోని కాకతీయ మెగా జౌళి పార్కును బ్రౌన్ ఫీల్డ్ పార్కుగా ప్రకటించడంతో దానికి రావల్సినన్ని నిధులు రానందున వెంటనే దానిని గ్రీన్‌ఫీల్డ్‌లోకి మార్చాలి.
- ప్రతి రాష్ట్రానికి ఐఐఎం మంజూరు చేయాలనే ప్రతిపాదన ఉంది.. తెలంగాణలో ఐఐఎం లేనందున హైదరాబాద్‌లో ఐఐఎం ఏర్పాటు చేయాలి.. అందుకు తగిన స్థలం అందుబాటులో ఉంది. కేంద్రం కోరితే ఐఐఎం ఏర్పాటుకు అవసరమైన స్థలం ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది.
- ఉమ్మడి రాష్ట్రంలో ఉన్న రెండు సైనిక పాఠశాలలు రాష్ట్ర విభజనతో ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిపోయాయి. ప్రస్తుతం తెలంగాణలో సైనిక స్కూల్ లేనందున సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో సైనిక పాఠశాల ఏర్పాటు చేయాలి.
- భారతీయ సైన్యానికి సంబంధించిన ప్రధాన కార్యాలయాలు అన్ని ప్రాంతాల్లో ఉన్నా దక్షిణాదిలో లేనందున పుణెలో ఉన్న ప్రధాన కార్యాలయాన్ని సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు తరలించాలి.
- రాష్ట్ర పునర్విభజన చట్టం తొమ్మిదో షెడ్యూల్‌లోని ప్రభుత్వ సంస్థల విభజన, పదో షెడ్యూల్‌లోని సంస్థల అంశాలను పరిష్కరించాలి. ఢిల్లీలోని ఉమ్మడి భవన్ విభజనకు సహకరించాలి" అని ప్రధానమంత్రి మోదీని సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కోరారు.

# లోక్‌సభ ఎన్నికల్లోను కాంగ్రెస్ దే హవా

మొదటిపేజీ తరువాయి

ఎన్నికల్లో బీజేపీకి ఒకటి నుంచి మూడు స్థానాలు మాత్రమే లభిస్తాయని సర్వే పేర్కొంది. దేశంలో మాత్రం ఈ సారి కూడా మోడీ ప్రభుత్వమే వస్తుందని సర్వే అభిప్రాయపడింది.

**రేవంత్ రెడ్డి ఫుల్ ఫామ్!**

ఆరు గ్యారంటీలతో కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో జోష్‌లో ఉంది. దీంతో పార్టీకి మరింత ప్రజాదరణ పెరిగినట్టు కనిపిస్తుంది. ఈ లోక్‌సభ ఎన్నికల్లో ప్రజలు మరోసారి కాంగ్రెస్ పార్టీకే ఓటు వేయడానికి సిద్ధపడ్డారని సర్వే తెలిపింది. రాష్ట్రంలో ఉన్న లోక్‌సభ స్థానాల్లో మెజారిటీ సీట్లను హస్తం పార్టీ దక్కించుకోవడం వ్యూహాలను సిద్ధం చేస్తున్నది. ఆశావాహులపై ఫోకస్ పెంచింది. పార్టీ అధిష్టానంతో టీ కాంగ్రెస్ ముందుకు సాగుతోంది. ఈ క్రమంలోనే సీఎం రేవంత్ రెడ్డి ఫుల్ ఫామ్‌లో ఉన్నట్లు కన్పిస్తున్నది.

# కొత్త కార్డులపై మార్గదర్శకాలు రూపొంచలేదు

మొదటిపేజీ తరువాయి

కచ్చితంగా హామీ ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేస్తుందన్నారు.

**ప్రజా పాలన గ్రామసభలు..**

డిసెంబర్ 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజా పాలన కార్యక్రమానికి తెలంగాణ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఆరు గ్యారంటీలకు సంబంధించి గ్రామ సభలు ఏర్పాటు చేసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఈ మేరకు ఆయా ఉమ్మడి జిల్లాలకు ఇన్‌ఛార్జ్ మంత్రులను సైతం నియమించారు. జీహెచ్ఎంసీ పరిధిలో ప్రజాపాలన నిర్వహణ ఏర్పాట్లపై మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. ప్రజా పాలనలో ప్రజల నుంచి స్వీకరించే దరఖాస్తులను తాము క్షుణ్ణంగా పరిశీలిస్తామని చెప్పారు. రాష్ట్రాన్ని గత పదేళ్లు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం పేదలకు ఎంతో ప్రయోజనం చూకూర్చేరేషన్ కార్డులను నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు.

**కొత్త రేషన్ కార్డుల జారీకి విధివిధానాలపై చర్చలు..**

గత ప్రభుత్వం అనర్హులకు రేషన్ కార్డులు తొలగించలేదు, కొందరు అర్హులను లబ్దిదారుల జాబితాలో చేర్చలేదన్నారు. కొత్త రేషన్ కార్డుల జారీకి విధివిధానాలపై చర్చలు జరుగుతున్నాయని ఏ నిర్ణయం తీసుకోలేదని తెలిపారు. లబ్ధిదారుల ఎంపికకు పాటించాల్సిన నిబంధనలు రూపొందించాల్సి ఉంది. రాష్ట్రంలో ఇదివరకే పింఛను తీసుకుంటున్న వారు కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు. అయితే ఇందిరమ్మ ఇల్లు కావాలనుకునే వారు అర్హులమని భావిస్తే దరఖాస్తు చేసుకోవాలన్నారు. తమ ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజావాణిలో ఇప్పటివరకు 25వేల దరఖాస్తులు వచ్చాయని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామ్నారు మంత్రి శ్రీధర్‌బాబు. డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు జరగనున్న ప్రజాపాలనలో ప్రతిరోజు రెండు షిఫ్టుల లో గ్రామసభల నిర్వహణ చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కొన్ని నెలలుగా రేషన్ తీసుకోని కార్డులు ఉంచాలా.. తీసేయాలా అనేదానిపై అధికారులతో మంత్రులు చర్చించారు. అర్హులకే రేషన్ కార్డులుండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని మంత్రి ఉత్తమ్ కొన్నిరోజుల కిందట ఆదేశించారు. సంక్షేమ పథకాలకు, రేషన్ కార్డులకు అనుసంధానం లేకుండా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. సంక్షేమ పథకాలకు రేషన్ కార్డు అనుసంధానిస్తే.. కార్డుల సంఖ్య పెరిగే అవకాశం ఉందనే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. కొత్త కార్డుల జారీకి ఆదాయ పరిమితి ఎంత విధించాలనే దానిపై చర్చించినా నిర్ణయం తీసుకోలేదు. ఈ వారంలో క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. గత 9 ఏళ్లుగా కొత్త రేషన్ కార్డులు జారీ కాని సంగతి తెలిసిందే.





# బీఆర్ఎస్ పాలనలో ఏ వర్గానికీ న్యాయం జరగలే

- విధ్వంసమైన తెలంగాణను గాడిలో పెడుతున్నాం
- 400 ఎకరాల ఫామ్ హౌజ్‌కోసమే కేసీఆర్ పనిచేశారు
- త్వరలోనే బీఆర్ఎస్ దోపిడీ పత్రం రిలీజ్ చేస్తం
- మంత్రులు కోమటిరెడ్డి, తుమ్మల, ఉత్తమ్



**బీఆర్ఎస్ దోపిడీ పత్రం విడుదల చేస్తాం..**

గత బీఆర్ఎస్ ప్రభుత్వ మోసాలను అసెంబ్లీ వేదికగా శ్వేతపత్రం ద్వారా విడుదల చేశామని.. బీఆర్ఎస్ దోపిడీపై త్వరలోనే దోపిడీ పత్రం విడుదల చేస్తామని కీలక ప్రకటన చేశారు. కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో బీఆర్ఎస్ చేసిన అవినీతిని బయటకు తీస్తామని స్పష్టం చేశారు. గత ప్రభుత్వంలో ఒక్కో బీఆర్ఎస్ ఎమ్మెల్యే వేల కోట్లు తిన్నారని తీవ్ర ఆరోపణలు చేశారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ అప్పుల రాష్ట్రంగా మార్చారని నిప్పులు చెరిగారు. నల్లగొండ జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్ట్‌లు పూర్తి చేస్తామని తెలిపారు.

**విశాల భారతి, స్టేట్‌బ్యూరో:**

నల్లగొండ ఎంఎన్ఆర్ కన్వెన్షన్ హాల్ లో మంత్రులు సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రజా పాలనపై ఉమ్మడి నల్లగొండ జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో జిల్లా ఇన్ చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి సమావేశం నిర్వహించారు. ఆ తర్వాత మంత్రులు మీడియా సమావేశం నిర్వహించారు.

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఏ వర్గానికి కూడా న్యాయం జరగలేదన్నారు మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి. అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే ఆరు గ్యారెంటీల్లో రెండు హామీలను అమలు చేశామని చెప్పారు. ఉమ్మడి నల్గొండ జిల్లాల్లో పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేస్తామన్నారు.

డిసెంబర్28 నుండి జనవరి 6 వరకు ప్రజా పాలన పారదర్శకంగా చేస్తామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. ఉమ్మడి నల్గొండ జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులన్నీ పూర్తి చేస్తామని, ప్రాజెక్టుల వద్దే కుర్చీ వేసుకుని.. నిర్మాణ పనులను పూర్తి చేస్తామన్న వారిలా తాము ఉండమన్నారు. పీడీఎస్ రైస్ రీసైక్లింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గతంలోనూ ఉమ్మడి నల్గొండ జిల్లా నేతలతో తనకు మంచి రాజకీయ సంబంధం ఉందన్నారు జిల్లా ఇన్ చార్జ్ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు. తన హయాంలో మొదలైన ప్రాజెక్టులు, రోడ్ల నిర్మాణాలు మళ్లీ ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి హయాంలో పూర్తి కాబోతున్నాయని చెప్పారు. ఈ ఐదేళ్లలో సంక్షేమం, అభివృద్ధిని ముందుకు తీసుకుపోతామన్నారు.

**ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో..**

ఖమ్మం జిల్లా కలెక్టరేట్‌లో ప్రజాపాలనపై అధికారులు ముగ్గురు మంత్రులు సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. పేదలకు ప్రభుత్వ పథకాలు అందించాలనేదే తమ ప్రయత్నమని చెప్పారు. పదేళ్లుగా విధ్వంసమైన తెలంగాణను గాడిలో పెడుతున్నామని అన్నారు. మల్లన్న సాగర్ ప్రాజెక్ట్ నిర్మించినా ఒక్క ఎకరాకు కూడా నీరివ్వలేకపోయారని బీఆర్ఎస్ నేతలపై అసహనం వ్యక్తం చేశారు.

400 ఎకరాల ఫాంహౌజ్ కోసమే కేసీఆర్ పనిచేశారని కీలక వ్యాఖ్యలు చేశారు. డిండి ప్రాజెక్టుల పేరుతో భూములు లాక్కున్నారని గుర్తుచేశారు. తప్పకుండా ఇచ్చిన ఆరు గ్యారంటీలను అమలు చేసి తీరుతామని మరోసారి స్పష్టం చేశారు. ఈ నెల 28వ తేదీ నుంచి జనవరి 6వ తేదీ వరకు ప్రజా పాలన కొనసాగబోతోందని అన్నారు. ధరణిలోని లోపాలను కూడా సరిచేస్తామని హామీ ఇచ్చారు. ధరణి పేరుతో ఆక్రమించుకున్న భూములను బయటకు తీస్తామని చెప్పారు.

# ఇబ్రహీంపట్నం మాజీ ఎమ్మెల్యే.. మంచిరెడ్డి కిషన్‌రెడ్డిపై కేసు నమోదు

మొదటిపేజీ తరువాయి

తెలిపారు. రెండున్నర కోట్లు తీసుకొని అప్పటి ఎమ్మెల్యే మంచిరెడ్డి మున్సిపల్ చైర్ పర్సన్ పదవి ఇచ్చారని స్రవంతి ఆరోపించారు. ప్రతి నెల రూ.5 లక్షల ఇవ్వాలని అప్పటి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కిషన్ రెడ్డి కొడుకు ప్రశాంత్ డిమాండ్ చేశారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. కిషన్ రెడ్డి చెప్పినట్లు వినలేదని అప్పటి కలెక్టర్ అమోయ్ కుమార్‌తో బెదిరించి తనకు షోకాజ్ నోటీసులు ఇప్పించారని స్రవంతి తన ఫిర్యాదులో తెలిపారు. అప్పర్ క్యాస్ట్ తో గొడవపడలేరని, లీవ్‌లో వెళ్లాలని కలెక్టర్ అమోయ్ కుమార్ 2022 జూలై 7న బెదిరించారని స్రవంతి ఆరోపించారు.



# మూడు నేర న్యాయ బిల్లులకు రాష్ట్రపతి ఆమోదం

మొదటిపేజీ తరువాయి

హోంశాఖ పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ పలు సూచనలు చేయగా బిల్లులను కేంద్రం వెనక్కి తీసుకుని కొన్ని సవరణలు చేసి శీతాకాల సమావేశాల్లో సభ ముందుకు తెచ్చింది. ఈ బిల్లులను గతవారం పార్లమెంట్ ఆమోదించి పంపగా తాజాగా రాష్ట్రపతి ఆమోదం తెలిపారు.

ఈ చట్టాల్లో ప్రతి నేరానికి సంబంధించిన నిర్వచనం, వాటికి విధించే శిక్షల గురించి వివరంగా ప్రస్తావించారు. తొలిసారి ఉగ్రవాదానికి స్పష్టమైన నిర్వచనం ఇవ్వడమే కాకుండా దోషులకు శిక్షలు విధించే విషయంలో మేజిస్ట్రేట్లకు ఉన్న అధికారాలను కొత్త చట్టాల్లో పెంచారు. నేరస్థుడిగా ప్రకటించే విషయంలో వారికి ఉన్న పరిధిని విస్తృతం చేశారు. దేశంలోని న్యాయ వ్యవస్థను ఈ మూడు చట్టాలు పూర్తిగా మార్చేయనున్నాయి.

# ముందస్తుకు మోదీ ప్లాన్?

మొదటిపేజీ తరువాయి

నియోజకవర్గాల ఇన్‌చార్జిలను వైసీపీ ఇటీవల మార్చింది.

**పార్లమెంటు ఎన్నికలపై సీఎం రేవంత్ ఫోకస్**

చంద్రబాబు పార్టీ నేతలతో వివిధ కమిటీలు ఏర్పాటు చేసి ఎన్నికలకు సమాయత్తం అవుతున్నారు. మరో వైపు తెలంగాణలోనూ సీఎం రేవంత్ రెడ్డి లోక్ సభ ఎన్నికలపై దృష్టి సారించారు. లోక్ సభ ఎన్నికల షెడ్యూల్ విడుదలకు ముందే కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలను అమలు చేసేందుకు యత్నిస్తున్నారు. హైదరాబాద్ మినహాయించి మిగతా 16 లోక్ సభ స్థానాలపై సీఎం రేవంత్ దృష్టి పెట్టారు. మరో వైపు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ 'వికసిత్ భారత్' సంకల్ప యాత్ర ద్వారా లోక్ సభ ఎన్నికలకు రెడీ అవుతోంది. కేంద్ర పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లేలా 40 రోజులపాటు 163 ప్రచార వెహికల్స్‌తో భారత్ సంకల్ప్ యాత్రకు ఇప్పటికే శ్రీకారం చుట్టారు. మాజీ సీఎం కేసీఆర్, ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డిని ఓడించిన కాటిపల్లి వెంకటరమణారెడ్డి నియోజకవర్గం నుంచి ఈ ప్రచార యాత్రను ప్రారంభించనున్నారు. తెలంగాణలో ఎక్కువ ఎంపీ స్థానాలు దక్కించుకోవాలనే లక్ష్యంతో బీజేపీ నేతలు వ్యూహాలు రూపొందించారు.



# క్రిమినల్ చర్యలకు పాల్పడిన యువతి.

- ఇట్టే పసిగట్టిన పోలీసులు.

**విశాలభారతి, హైదరాబాద్:** ఈ మధ్యకాలంలో ప్రేమించడం ప్రేమ విఫలం అయితే ఆత్మహత్య చేసుకొని చనిపోవడం పరిపాటిగా మారిపోయింది. అయితే ఇక్కడ మాత్రం కాస్త భిన్నంగా జరిగింది. మాజీ ప్రియుడిపై పగ తీర్చుకునేందుకు మాస్టర్ ప్లాన్ వేసింది రింకీ అనే యువతి. కానీ.. అనుకున్నది ఒకటి అయినది ఒకటి అన్నట్లు ఆ యువతి ప్లాన్ మొత్తం పసిగట్టారు పోలీసులు. ఆమెతో సహా మొత్తం గ్యాంగ్‌ను అరెస్ట్ చేశారు. ఈ ఘటన హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ పరిధిలో జరిగింది హైదరాబాద్ రహమత్‌నగర్‌లో నివాసముంటున్న రింకీ.. అమీర్‌పేటలోని ఓ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తోంది. సరూర్‌నగర్‌కు చెందిన శ్రవణ్ కూడా అదే ప్రాంతంలో పనిచేస్తున్నాడు. వీరిద్దరూ కొంతకాలం ప్రేమించుకున్నారు. ఆ తర్వాత శ్రవణ్.. రింకీని దూరం పెడుతూ వచ్చాడు. దీంతో ప్రియుడి మీద కోపం పెంచుకున్న యువతి పగ తీర్చుకోవాలని నిర్ణయించుకుంది. కోపం ఉంది కానీ ఆ కోపాన్ని తీర్చుకునే మార్గం ఆమెకు కనిపించలేదు. అవకాశం కోసం కొంత కాలం ఎదురుచూసింది. తానే కర్త, కర్మ, క్రియ అయ్యి.. ప్రియుడిని ఇరికించాలని నిర్ణయించుకుంది. తన స్నేహితుల ద్వారా గంజాయి సేకరించింది. ఆ గంజాయిని మరో ఫ్రెండ్ సహాయంతో ప్రియుడి కారులో పెట్టేలా పథకం రచించింది. దీని కోసం అందరూ కలిసి పబ్ కి వెళ్లారు. అక్కడ తన మాజీ ప్రియుడి కార్లో గంజాయి ప్యాకెట్లు పెట్టాలని స్నేహితులకు చెప్పింది. తరువాత తానే పోలీసులకు ఫోన్ చేసి ఫలానా రిజిస్ట్రేషన్ నంబర్ కలిగిన కారులో గంజాయి సరఫరా జరుగుతోందని సమాచారం ఇచ్చింది. పోలీసులు ఆ కారును ఆపి చెక్ చేయడంతో నిజంగానే కారులో 40 గ్రాముల గంజాయి దొరికింది. దీంతో ఆ అబ్బాయిని అరెస్ట్ చేసి విచారణ ప్రారంభించారు పోలీసులు. తనకే పాపం తెలియదని ఆ అబ్బాయి ఎంత చెప్పినా వినలేదు. కానీ.. పోలీసుల విచారణలో అబ్బాయికి క్లీన్ రికార్డ్ వచ్చింది. గతంలో కేసులు గానీ, గంజాయి డీలర్స్‌తో కాంటాక్ట్స్ కానీ ఏవీ లేవని గుర్తించారు పోలీసులు. సాంకేతికంగా తన ఫోన్ నంబర్లు, వాట్సప్ డేటా మొత్తం పరిశీలించారు ఎక్కడా క్రిమినల్ లావాదేవీలు ట్రేజ్ కాలేదు. దీంతో ఆ అబ్బాయి చెప్పేది నిజమే అనుకుని.. అమ్మాయి యాంగిల్‌లో విచారణ చేయడం ప్రారంభించారు పోలీసులుఅమ్మాయిని పిలిపించి ఆ కారులో గంజాయి ఉన్న విషయం నీకు ఎలా తెలుసంటూ విచారించారు. క్రాస్ క్వశ్చనింగ్ చేయడంతో అమ్మాయి దొరికిపోయింది. దీంతో అమ్మాయిని, ఆమెకు సహకరించి స్నేహితుల ముఠాను అరెస్ట్ చేశారు జూబ్లీహిల్స్ పోలీసులు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. లవర్ మీద కోపంతో పగ తీర్చుకోవాలనుకుని తానే కేసులో అడ్డంగా ఇరుక్కుంది రింకీ. రింకీకి సహకరించిన మరో ఆరుగురిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.



# ట్రాఫిక్ చలాన్లపై భారీ డిస్కౌంట్

- త్రీ వీలర్స్‌పై 90 శాతం
- టూ వీలర్స్‌పై 80 శాతం

**విశాలభారతి, హైదరాబాద్:**

డిస్కౌంట్ పై ట్రాఫిక్ చలాన్ల చెల్లింపులకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం జీవో విడుదల చేసింది. ఈ జీవోలో పేర్కొన్న వివరాల ప్రకారం.. టూవీలర్స్ పై 80 శాతం, త్రీ వీలర్స్ పై 90 శాతం, కార్లపై ఉన్న చలాన్ల విషయంలో 50 శాతం రాయితీ ప్రకటించారు. ఈ మేరకు రవాణా శాఖ కార్యదర్శి జీవో జారీ చేశారు. ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడడం వల్ల పోలీసులు వేసిన చలాన్లు పేరుకుపోయిన వారికి పోలీసులు ఓ సదావకాశాన్ని ఇచ్చిన సంగతి తెలిసిందే. చలాన్ల చెల్లింపు చేస్తే భారీ డిస్కౌంట్ ఉంటుందని పోలీసులు ప్రకటించారు. దీంతో తమ వాహనాలపై పెండింగ్ లో ఉన్న చలాన్లను కట్టేందుకు జనం ఎగబడడంతో ట్రాఫిక్ చలాన్ల సైట్ కాస్త నిలిచిపోయింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నేటి (డిసెంబర్ 26) నుంచి జనవరి 10వ తేదీ వరకు పెండింగ్ చలాన్లను రాయితీతో చెల్లించొచ్చని అవకాశం కల్పించింది. కానీ, వాహనదారులు తొలిరోజే చలాన్లు కట్టడానికి ఎగబడడంతో సైట్ పై ట్రాఫిక్ ఒత్తిడి పెరిగిపోయి క్రాష్ అయింది. దీంతో వాహనదారులు అయోమయానికి గురవుతున్నారు. డిస్కౌంట్ల ద్వారా పెండింగ్ చలాన్ల బకాయిలు క్లియర్ అవుతాయని ప్రభుత్వం భావిస్తోంది. తద్వారా భారీ ఆదాయం సమకూరుతుందని అధికారులు అంచనా వేశారు. అదీకాక వాహనదారులకు జరిమానాల భారం కూడా తగ్గుతుంది. ఈ క్రమంలోనే నేడు ఉదయం నుంచే ట్రాఫిక్ చలాన్లు కట్టేందుకు వాహనదారులు ఈచలాన్ వెబ్ సైట్ ఓపెన్ చేసి.. తమ చలాన్లు క్లియర్ చేసుకొనేందుకు ప్రయత్నించారు. దీంతో ఈ చలాన్ వెబ్‌సైట్ లో వెహికల్ నెంబర్ ఎంటర్ చేసిన తర్వాత డీటెయిల్స్ చూపించడం లేదు. దీంతో వినియోగదారులు పదే పదే రీఫ్రెష్ చేస్తూ అయోమయానికి గురవుతున్నారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని ట్రాఫిక్ పోలీసులకు వాహనదారులు విజ్ఞప్తి చేస్తున్నారు.

**డిస్కౌంట్ ఎంతంటే..**

న్యూ ఇయర్ వేళ పోలీసులు వాహనదారులకు ఈ కానుక ఇచ్చినట్లు అయింది. పెండింగ్ ట్రాఫిక్ చలాన్ల (Pending eChallans) చెల్లింపుపై భారీ డిస్కౌంట్ లో భాగంగా బైక్‌లు, స్కూటర్లపై 80 శాతం, ఆటోల చలాన్ల విషయంలో 80 శాతం డిస్కౌంట్ ఇచ్చారు. కార్లు, ట్రక్కులు, ఇతర భారీ వాహనాలపై పెండింగ్ చలాన్ల విషయంలో 50 శాతం రాయితీ కల్పించారు. ఆర్టీసీ డ్రైవర్లకు, తోపుడు బండ్ల వారికి 90 శాతం రాయితీని ప్రకటించారు. ట్రాఫిక్ చలాన్ల చెల్లింపులో రాయితీలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఓకే అనడంతో పోలీస్ అధికారులు ఈ ఆదేశాలు జారీ చేశారు. వాహనదారులు https://echallan.tspolice.gov.in/publicview/ వెబ్‌సైట్‌లో వాహనదారులు ఈ నెల 26 నుంచి జనవరి 10 వరకు ఆన్ లైన్‌లో పెండింగ్ చలాన్లను రాయితీపై చెల్లించవచ్చని అధికారులు వెల్లడించారు



# అవినీతిపై విచారణ జరిపించాలి

**సీపీఐ(ఎం.ఎల్)ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్**

**సూర్యాపేట, విశాలభారతి:** జిల్లా కేంద్రంలో జరిగిన అభివృద్ధి పనుల్లో అవినీతి పై ఎంక్వయిరీ కమిటీ వేసి సిట్టింగ్ జడ్జి ద్వారా విచారణ జరిపి, అవినీతికి పాల్పడ్డ కాంట్రాక్టర్లను దానికి సపోర్టుగా నిలిచిన అధికారులను, గతంలో ఉన్న అధికార పార్టీ నాయకులను శిక్షించి అవినీతి సొమ్మును ప్రజలకు పంచాలని సీపీఐ(ఎం.ఎల్)ప్రజాపంథా జిల్లా కార్యదర్శి కొత్తపల్లి శివకుమార్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. జిల్లా కేంద్రంలోని విక్రమ్ భవన్లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వంలో తొమ్మిదిన్నర సంవత్సరాలలో అభివృద్ధి పేరుతో వందల కోట్లు ప్రజాధనాన్ని వృధా చేసి, కాంట్రాక్టర్లు అధికారులు కుమ్మక్కై అవినీతికి పాల్పడి ప్రజల సొమ్మును దోచుకున్నారని అన్నారు. ఈ పనులన్నీ ఒక్క శ్రీనివాస్ రెడ్డికి ఇచ్చి అవినీతి కుంభకోణానికి మార్గమేశారన్నారు. సూర్యాపేట కేంద్రంలో అభివృద్ధి పనులు జరిగేటప్పుడు వాటిని పరిశీలించి అనేకసార్లు పార్టీ ఆధ్వర్యంలో నిరసనలు,ధర్నాలు, పాదయాత్రలు చేశామనీ తెలిపారు. దానికి మా పైన గత ప్రభుత్వం అక్రమ కేసులు బనాయించారు.. కానీ అవినీతి కాంట్రాక్టర్ పైన అధికారుల పైన ఎలాంటి చర్యలు తీసుకోలేదు, అందువల్లనే అభివృద్ధి పనులలో నాణ్యత లోపించి నాలుగు రోజుల కింద పోస్ట్ ఆఫీస్ దగ్గర రోడ్డు కుంగిపోవడం జరిగిందనీ తెలిపారు.అదేవిధంగా ట్యాంక్ బండ్ పనులు మొత్తం కూడా నాణ్యత లోపంతో ఉన్నాయనీ, ఇవే కాకుండా పట్టణ కేంద్రంలో జరిగిన ప్రతి అభివృద్ధి పనిలో నాణ్యత లోపం స్పష్టంగా కనిపిస్తుంది అన్నారు. కాబట్టి ఇప్పుడు వచ్చిన ప్రభుత్వం వీటిపైన సిట్టింగ్ జడ్జి ద్వారా విచారణ జరిపించి, అవినీతి కాంట్రాక్టర్లు గత ప్రభుత్వంలో ఉన్నవాళ్లు, అధికారులను కటకటాలకు పంపించి శిక్షించాలని,దోచుకున్న సొమ్మును వెలికి తీసి ప్రజలకు పంచాలని మా పార్టీ ద్వారా విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. లేనియెడల ముందు ముందు పోరాటాలను ఉధృతం చేస్తామని తెలిపారు.

# కొనసాగుతున్న ధనుర్మాస మహోత్సవాలు

**మంగళనీరజనం పడుతున్న మహిళలు**

సూర్యాపేట, విశాలభారతి: జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న ధనుర్మాస మహోత్సవాలు మంగళవారం నాటికి పది రోజులకు చేరుకున్నాయి.ఈ సందర్భంగా మహిళా భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో తెల్లవారుజామునే స్వామివారి సన్నిధికి చేరుకొని తిరుప్పావై సేవాకాలం చేస్తూ తన్మయత్వం పొందుతున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలచార్యులు భక్తులందరికీ ప్రతిరోజు భగవద్గీత నేర్పుతూ పారాయణం చేయిస్తున్నారు. మరియు భగవద్గీత తాత్పర్యాన్ని భక్తులకు తెలియపరుస్తూ సాక్షాత్తు శ్రీ కృష్ణ పరమాత్మ అందించిన భగవద్గీత పరమార్థాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని తద్వారా జీవిత గమనాన్ని సుగమం చేసుకోవాలని వారు తెలిపారు. అధిక సంఖ్యలో పాల్గొంటున్న భక్తులు ఈ సందర్భంగా భగవద్గీత నేర్చుకోవడం తమకు ఎంతో సంతోషాన్ని కలిగిస్తున్నదని అంటున్నారు. ఇలా నేర్చుకోవడం ద్వారా తప్పులు లేకుండా చదవగలుగుతున్నామని వారు అన్నారు. అంతేకాకుండా తాత్పర్యం తెలుసుకోవడం ద్వారా నేర్చుకోవాలని కుతూహలం కలుగుతున్నదని వారు అన్నారు. కార్యక్రమంలో మహిళా భక్తులు, వికాస తరంగిణి, ఆండాళ్ గోష్ఠి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.





# సావిత్రిబాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహిస్తాం

**బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు మణి మంజరి.**

**ముషీరాబాద్,విశాలభారతి:** జనవరి 3న సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలను రవీంద్ర భారతిలో ఘనంగా నిర్వహిస్తామని సావిత్రిబాయి పూలే జయంతి ఉత్సవ కమిటీ చైర్మన్, బీసీ సంక్షేమ సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు మణి మంజరి పేర్కొన్నారు. మంగళవారం దోమలగూడలోని బీసీ భవన్ లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడారు. సావిత్రిబాయి పూలే ను ప్రతి మహిళ ఆదర్శంగా తీసుకొని విద్యలో రాణించడం తోపాటు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని ఆమె పిలుపునిచ్చారు. సావిత్రిబాయి పూలే త్యాగాల ఫలితమే ఈరోజు మహిళలు విద్యావంతులుగా ఉండి అన్ని రంగాల్లో రాణిస్తున్నారని తెలిపారు. సావిత్రిబాయి పూలే అవార్డులు, మెమొంటో ల కోసం ఇప్పటికే 600 పైగా ఆన్లైన్ వెబ్సైట్ ద్వారా అప్లికేషన్స్ వచ్చాయన్నారు. వాటన్నిటినీ పరిశీలించి 300 మహిళలను ఎంపిక చేసి వారికి పూలే అవార్డులు మెమొంటోలతో సత్కరిస్తామని వివరించారు. రవీంద్రభారతిలో జరిగే సావిత్రిబాయి పూలే జయంతి కార్యక్రమానికి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆమె కోరారు. ఈ సమావేశంలో మహిళా సంఘం నాయకురాలు తారకేశ్వరి,సమతా, సంధ్యారాణి,సుజాత, పద్మజ, దేవిక, రేణుక, లావణ్య, పద్మశ్రీ, తదితరులు పాల్గొన్నారు.



# కమ్యూనిస్టులు లేని పోరాటం ఊహించలేము

- **నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడేది సిపిఐ**
- **ప్రభుత్వం ఏదైనా ప్రజా సంక్షేమమే మా కర్తవ్యం**

**సూర్యాపేట, విశాలభారతి:** దేశంలో కమ్యూనిస్టులు చేసిన పోరాట ఫలితంగానే అనేక సమస్యలు పరిష్కారం అయ్యాయని కమ్యూనిస్టులు లేని పోరాటాలను ఊహించలేమని సిపిఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు అన్నారు. సిపిఐ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మంగళవారం స్థానిక ధర్మభిక్షం భవన్లో జెండా ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా సమిష్టిగా వాటిని అధిగమించి భారత కమ్యూనిస్టు పార్టీ ముందుకు సాగుతుందని అన్నారు. పదవులు లేకున్నా ప్రభుత్వం ఏదైనా నిరంతరం ప్రజల మధ్య ఉండి ప్రజల సమస్యలపై పోరాడడమే సిపిఐ కర్తవ్యం అన్నారు. నాటి నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలని, పేద బడుగు బలహీన వర్గాల న్యాయం చేయాలని పోరాటం చేసిన భారత్ కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) పార్టీ 1925 సంవత్సరంలో ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని కాన్పూర్ లో స్థాపించబడిందన్నారు. నాటి నుంచి ఎన్నో ప్రజా ఉద్యమాలు నడిపి, ప్రజా సంక్షేమం బాటలో అనేక మంది నాయకులు అమరులయ్యారని తెలిపారు. రాష్ట్రంలో నిజాం నవాబుల నియంతృత్వ పోకడలతో విసిగిపోయిన ప్రజలను ఆ బాధల నుంచి విముక్తి కల్పించిన పార్టీ సిపిఐ అన్నారు. లక్షలాది మంది ప్రాణ త్యాగాలతో, ఎన్నో వీరోచిత పోరాటాలు చేసి దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నదనీ గుర్తు చేశారు. కూడు, గూడు లేనీ నిరుపేద ప్రజలకు అండగా ఎర్రజెండా ఉంటుందన్నారు. తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో నాలుగున్నర వేల మంది ప్రాణాలు ఇచ్చి లక్షలాది ఎకరాలను పేదలకు పంచిన చరిత్ర సిపిఐ పార్టీకి తప్ప ఏ ఇతర పార్టీలకు లేదన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు అనంతల మల్లేశ్వరి, పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, నాయకులు దంతాల రాంబాబు, బొమ్మగాని శ్రీనివాస్, దొరిపెల్లి శంకర్, చామల అశోక్, నిమ్మల ప్రభాకర్ దీకొండ శ్రీనివాస్, శేఖర్, తదితరులు పాల్గొన్నారు



# ప్రజా పాలన సభల్లో పాల్గొంటాం

- **ఆరు గ్యారంటీలు అమలు చేసే వరకు ఒత్తిడి తెస్తాం**
- **బిఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్**

**సూర్యాపేట, విశాలభారతి:** రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే ప్రజా పాలన సభల్లో పాల్గొని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో మా ప్రజాప్రతినిధులు, నాయకులు ముందు ఉంటామని రాజ్యసభ సభ్యులు, బిఆర్ఎస్ జిల్లా పార్టీ అధ్యక్షులు బడుగుల లింగయ్య యాదవ్ అన్నారు. మంగళవారం జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా తీర్పు అనుకూలంగా రాకపోవడంతో ప్రభుత్వం మారిందని గెలుపు ఓటములు సహజమని అన్నారు. గత పదేళ్లుగా ప్రజలు అధికారం ఇస్తే అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశామన్నారు. తాము అధికారంలో లేకున్నా ప్రజల కోసం నిరంతరం మరింత రెట్టింపు ఉత్సాహంతో ప్రతిపక్ష పాత్ర పోషిస్తామని అన్నారు. ప్రభుత్వ విధానాల్లో మంచి ఉంటే సహకరిస్తామని చెడు ఉంటే బలమైన ప్రతిపక్ష పోరాటం చేస్తామన్నారు. ప్రజా పాలన సభల్లో పాల్గొని సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో తాము ముందు ఉంటామని అన్నారు. పార్టీ గెలుపు ఓటములపై విశ్లేషణ చేసి ప్రజా తీర్పును గౌరవిస్తామన్నారు. ఆరు గ్యారెంటీలు కచ్చితంగా అమలు చేసే వరకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గతంలో మా ప్రభుత్వం సరైన పాలన చేయలేదని అప్పుల పాలు చేసిందనడంలో వాస్తవం లేదని 3 లక్షల కోట్ల అప్పులు చేస్తే కోట్లాది రూపాయల ఆస్తులను తయారు చేశామన్నారు. 50 ఏళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం చేయని అభివృద్ధి పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేసినట్లు మంత్రి కేటీఆర్ స్వేదపత్రం విడుదల చేశారని అన్నారు. ప్రతిపక్షంగా కూడా ప్రజల పక్షాన ఉండి పనిచేస్తామని పార్టీ ఎన్నికల్లో సహకరించిన నాయకులకు ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. ఈ సమావేశంలో టిఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై వెంకటేశ్వర్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మల్లేష్ తదితరులు ఉన్నారు.




# ఘనంగా క్రిస్మస్ వేడుకలు

**తుర్కయంజాల్, విశాలభారతి:**

తుర్కయంజాల్ మున్సిపాలిటీ పరిధి సుందరయ్య నగర్ కాలనీలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ పర్వదినం సందర్భంగా షాలెం గోస్పెల్ చర్చ్ ఫౌండర్ జి. సువర్ణ రాజు, సంఘ సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన వేడుకలు అంబరాన్నంటాయి. క్రీస్తు మార్గం నీతిమంతమైన మార్గమని వక్తలు అన్నారు. ఏసుక్రీస్తు చూపిన శాంతి మార్గంలో ప్రతి ఒక్కరూ నడుచుకోవాలని అన్నారు. మానవాళికి శాంతి, సమాధానం, ప్రేమను బోధించిన క్రీస్తు సూక్తులను కేవలం బోధనలకే పరిమితం చేయకుండా ఆచరణలోకి తీసుకురావాలని సూచించారు. ఆ ప్రేమను అందరికీ పంచాలన్నారు. క్రిస్టియన్ల సంక్షేమం కోసం ప్రభుత్వాలు తోడ్పాటు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్



సీనియర్ నాయకులు గుండ్లపల్లి హరితాధనరాజ్ గౌడ్, నారని శేఖర్ గౌడ్, దాసరి సుధాకర్ రెడ్డి, డా .రాగ్యా నాయక్, సిపిఐ నాయకులు ఓ. యాదయ్య, స్థానిక నాయకులు రాజు నాయక్, భూక్యా సుజాత తదితరులు పాల్గొన్నారు.

# ఎర్రజెండాతోనే ప్రజా సమస్యల పరిష్కారం

**ఇబ్రహీంపట్నం,విశాలభారతి:**

భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) 99వ ఆవిర్భావ వేడుకలు తుర్కయంజల్ మున్సిపాలిటీ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో సీపీఐ జెండాను ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యులు ఓరుగంటి యాదయ్య ఎగురవేశారు. ఈ సందర్భంగా యాదయ్య మాట్లాడుతూ దేశంలో అన్ని వర్గాల ప్రజల సమస్యలను పరిష్కరించే శక్తి ఒక్క ఎర్రజెండాకు మాత్రమే ఉన్నదన్నారు. దేశ స్వాతంత్ర పోరాటంలో కమ్యూనిస్టులు కీలక పాత్ర పోషించారని అన్నారు. కార్మికుల హక్కుల కోసం, భూమికోసం, భుక్తి కోసం అలుపెరగని పోరాటాలు కమ్యూనిస్ట్ పార్టీ చేసిందని అన్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో నిజాంకు వ్యతిరేకంగా పోరాడి 4వేల మంది కార్యకర్తలను కమ్యూనిస్టు పార్టీ కోల్పోయిందన్నారు. తెలంగాణ ప్రజలకు పది లక్షల ఎకరాల భూమి



పంచిన చరిత్ర ఎర్ర జెండాది మాత్రమే అని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా సమితి సభ్యులు పి శివకుమార్ గౌడ్, కాటంరాజు, అనురాధ, విజయ, పల్లపు శివకుమార్, భాస్కర్, సుందరమ్మ, ఆనంద్, గువ్వల రాజు, ప్రవీణ్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



# వంగవీటి మోహన రంగకు నివాళులు అర్పించిన జివిఆర్

**కూకట్ పల్లి,విశాలభారతి:**బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి, ప్రజా సమస్యల పోరాటానికై తన ప్రాణాలను అర్పించిన మహనీయుడు, విజయవాడ తూర్పు మాజీ ఎమ్మెల్యే స్వర్గీయ వంగవీటి మోహన రంగా 35 వ వర్ధంతి సందర్భంగా మంగళవారం కూకట్ పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ సీనియర్ నాయకులు గొట్టుముక్కల వెంకటేశ్వర రావు హౌసింగ్ బోర్డు కాలనీ టెంపుల్ బస్ స్టాప్ ప్రాంతంలో ఆ మహనీయుడి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి అన్నదానం చేశారు



# రామాలయం లో ఘనంగా దత్త జయంతి

**ప్రత్యేక పూజలు నిర్వహించిన కార్పొరేటర్ సతీష్ గౌడ్.**

**కూకట్ పల్లి,విశాలభారతి:**

మూసాపేట సర్కిల్ ఫతే నగర్ డివిజన్ పరిధిలోని రామాలయంలో మంగళవారం దత్త జయంతి సందర్భంగా మురళి పంతులు అధ్వర్యంలో లో దత్త హోమం నిర్వహించారు. ఆ హోమంలో స్థానిక కార్పొరేటర్ పండాల సతీష్ గౌడ్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వెంకట రామ్ నర్సయ్య, ఉపేందర్, కరుణాకర్, రామారావు వీరేశం గుప్తా సాయి స్వామి పాల్గొన్నారు



# జగదీశ్వర్ గౌడ్ కి శుభాకాంక్షలు తెలిపిన సింధం శ్రీకాంత్

**శేరిలింగంపల్లి ,విశాలభారతి:** శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన జగదీశ్వర్ గౌడ్ ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ నియమిస్తూ బాధ్యతలు అప్పగించిన సందర్భంగా హైదర్ నగర్ డివిజన్ సీనియర్ నాయకులు సింధం శ్రీకాంత్ జగదీశ్వర్ గౌడ్ ను మంగళవారం ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ ప్రజల మనిషి, ఎల్లవేళలా ప్రజలకు అందుబాటులో ఉండే, జగదీశ్వర్ గౌడ్ కి నియోజకవర్గ ఇన్చార్జ్ బాధ్యతలు అప్పజెప్పడం మంచి నిర్ణయమని,ఆయన నాయకత్వంలో శేరిలింగంపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలమైన శక్తిగా ఎదుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్ యాదవ్,సాధ మహేష్,నర్సింగరావు, రాము,రషీద్,ఆంజనేయులు మహేష్‌గౌడ్,రాజిరెడ్డి సుందరం,స్వామి,తదితరులు ఉన్నారు.



# అయ్యప్ప మండల పూజ లో పాల్గొన్న జెట్టి కుసుమ కుమార్, సత్యం శ్రీరంగం

**కూకట్ పల్లి,విశాలభారతి:** కూకట్ పల్లి నియోజకవర్గం భరత్ నగర్ కాలనీ సాయి అయ్యప్ప దేవాలయంలో జరుగుతున్న మండల పూజా కార్యక్రమానికి ఏ బ్లాక్ అధ్యక్షులు పి. నాగి రెడ్డి ఆహ్వానం మేరకు మంగళవారం టీపీసీసీ అధికార ప్రతినిధి డా. సత్యం శ్రీరంగం ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యం శ్రీరంగం మాట్లాడుతూ అయ్యప్ప మండల పూజలో పాల్గొనడం ఆనందంగా ఉందని, దేవుని నామస్మరణలోనే మనిషికి ముక్తి లభిస్తుందని, భగవంతుని ధ్యానంతో మనిషి ప్రశాంతత కలుగుతుందని, ఆ హరిహర పుత్ర అయ్యప్ప స్వామి అందరిని చల్లగా చూడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుమ కుమార్ భాను ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ నాయకులు మురళి క్రిష్ణా, తూము మనోజ్ కుమార్. ప్రభాకర్ రెడ్డి గురుస్వామి, నాగిరెడ్డి గురుస్వామి, రామకృష్ణ స్వామీ, నరేందర్ స్వామీ, సత్తయ్య స్వామీ, బాలు, రవీందర్ రెడ్డి, శ్రీనివాస స్వామీ, గణపతి స్వామీ మరియు పెద్ద ఎత్తున గురుస్వాములు పాల్గొన్నారు.

# పొన్నం ప్రభాకర్ కు శుభాకాంక్షలు తెలిపిన కర్క నాగరాజు

**కూకట్ పల్లి,విశాలభారతి:** గ్రేటర్ హైదరాబాద్ అల్ ఇండియా అంబేద్కర్ యువజన సంగం అధ్యక్షులు ఎ.ఐ.ఎ.వై.యస్ కర్క నాగరాజు ఆధ్వర్యంలో ఇటీవల తెలంగాణ రాష్ట్రానికి ట్రాన్స్పోర్ట్ మరియు బిసి వెల్ఫేర్ శాఖ మంత్రి గా ప్రమాణ స్వీకారం చేసిన పొన్నం ప్రభాకర్ ను మంగళవారం హైదరాబాద్ లో వారి నివాసంలో కలిసి శాలువాతో సత్కరించి పూలభోకే అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమం లో గ్రేటర్ హైదరాబాద్ అల్ ఇండియా అంబేద్కర్ యువజన సంగం నాయకులు జక్కుల అశోక్, శ్రీనివాస్, సదామహేష్,కంది సాయికుమార్ ఫయాస్,గుండె శివరాజు పాల్గొన్నారు.

మిగతా 4 లో



విశాల భారతి
తెలుగు దిన పత్రిక
GENERAL NEWS
జనరల్ న్యూస్
vishalabharathi Telugu Daily
www.vishalabharati.com
epaper:vishalabharati.com


# సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తా

**గౌడ సంఘం తాలూకా అధ్యక్షులు చుక్క అల్లాజీ గౌడ్**



**కల్వకుర్తి, విశాల భారతి:** కల్వకుర్తి గౌడ సంఘం అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని తాలూకా అధ్యక్షుడు చుక్క అల్లాజి గౌడ్ అన్నారు. మంగళవారం కల్వకుర్తి పట్టణంలోని వై ఆర్ ఎం జూనియర్ కళాశాలలో తాలూకా గౌడ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తాలూకా అధ్యక్షుడు అల్లాజిగౌడ్ మాట్లాడుతూ గౌడ సంఘం అభివృద్ధికి ఎల్లవేళల కృషి చేస్తానని, ప్రతి గౌడ కుటుంబానికి అండగా ఉంటానని అన్నారు. అనంతరం నూతన సంవత్సరం సందర్భంగా క్యాలెండర్ ఏర్పాటు పై సమీక్ష నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తాలూకా గౌడ సంఘం ప్రధాన కార్యదర్శి రాఘవేందర్ గౌడ్, తాలుక యువజన సంఘం అధ్యక్షులు రుక్కులు గౌడ్, ముఖ్య సలహాదారుడు బాలస్వామి గౌడ్, తాలూకా సంఘం కోశాధికారి తాళ్ల వెంకట గౌడ్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ విజయ్ గౌడ్, కల్వకుర్తి గౌడ సంఘం మండల అధ్యక్షుడు దామోదర్ గౌడ్ తదతర నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## గుండెపోటుతో యువకుడు మృతి

**భీమదేవరపల్లి, విశాల భారతి:** మండలంలోని ముల్కనూర్ గ్రామానికి చెందిన ముప్పిడి ప్రమోద్(32) మంగళవారం ఉదయం గుండె పోటుతో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ప్రకారం.. ప్రమోద్ ఉదయాన్నే మండల కేంద్రంలోని ఓ గుడికి వెళ్లి దర్శనం చేసుకొని ఇంటికి రాగానే కొద్ది సేపటికే గుండెపోటుతో కుప్పకూలినట్లు తెలిపారు. వెంటనే అతన్ని ఆస్పత్రికి తరలించేలోపే మార్గమధ్యంలో మృతి చెందినట్లు తెలిపారు. మృతుడికి రెండు సంవత్సరాల క్రితమే వివాహం అయింది. ప్రమోద్ మృతితో కుటుంబ సభ్యులు, స్నేహితులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు.

## బైక్ అదుపుతప్పి వ్యక్తి మృతి

**భీమదేవరపల్లి, విశాల భారతి :** ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం పై నుండి పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తకొండ గ్రామంలో చోటుచేసుకుంది. ముస్తాపూర్ గ్రామానికి చెందిన గడ్డం రాజిరెడ్డి(54) హుజురాబాద్ లో బంధువుల పెద్దకర్మకి వెళ్లి తిరిగి వస్తున్న సమయంలో కొత్తకొండ సబ్ స్టేషన్ వద్ద బైకు అదుపు తప్పి కింద పడటంతో తలకు బలమైన గాయాలు అయ్యాయి. దీంతో 108 లో ఎంజీఎంకి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతునికి భార్యతో పాటు ఒక కుమారుడు ,ముగ్గురు కూతుర్లు ఉన్నారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. మృతుని కుమారుడు గడ్డం నవీన్ ఫిర్యాదు మేరకు ముల్కనూర్ ఎస్ఐ సాయిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.



## ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

**మరిపెడ,విశాల భారతి:** ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కొరకు మలిదశ తెలంగాణ ఉద్యమంలో అనేక కేసులను ఎదుర్కొన్న, ప్రత్యేక రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించిన మలి దశ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని డోర్నకల్ శాసనసభ్యులు జాటోత్ రామచంద్రనాయక్ కి మరిపెడ మండల కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక నాయకులు వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్వరాష్ట్ర ఏర్పాటు తర్వాత మలిదశ ఉద్యమకారులకు సరైన గుర్తింపు లేదని వారు అన్నారు కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా తెలంగాణ ఉద్యమకారులను 250 గజాల ఇంటి స్థలాన్ని కేటాయించి,వారికి గౌరవ భృతి అందిస్తామని పేర్కొనడం జరిగిందని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి ఉద్యమకారులను ప్రభుత్వ పరంగా ఆదుకోవాల్సిందిగా కోరుతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో మలిదశ తెలంగాణ ఉద్యమ ఐక్యవేదిక నాయకులు లింగాల మహేష్‌గౌడ్,బోడపట్ల వెంకన్న, మారగాని బాలకృష్ణ,బోడపట్ల సతీష్,అబ్దుల్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.



## దత్త జయంతి ఉత్సవాల్లో మాజీ ఎంపీ శెట్కార్

**నారాయణఖేడ్, విశాల భారతి:** బర్దిపూర్ దత్తగిరి ఆశ్రమంలో దత్తాత్రేయ స్వామికి టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు మాజీ ఎంపీ సురేష్ షేట్కర్ పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు శాలువతో సన్మానిచ్చారు. ఈ వేడుకలో మాజీ జడ్పీటీసీ భాస్కర్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

## దత్తగిరి ఆశ్రమంలో సాగర్ శెట్కర్



**నారాయణఖేడ్, విశాల భారతి:** దత్త జయంతి సందర్భంగా నారాయణఖేడ్ మున్సిపల్ పరిధిలోని దత్తగిరి ఆశ్రమంలో సాగర్ షెట్కర్ దత్తాత్రేయ స్వామికి పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఆయనకు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాయిల్ పటేల్, సాయి, కాలనీవాసులు పాల్గొన్నారు.



## డివిజన్ లో ఆలయాల అభివృద్ధికి కృషి

**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వద్దేపల్లి రాజేశ్వర్ రావు**

**కూకట్ పల్లి,విశాలభారతి:** మూసాపేట సర్కిల్ ఫతే నగర్ డివిజన్ పరిధిలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వద్దేపల్లి రాజేశ్వర్ రావు మంగళవారం బీజేపీ భరోసా యాత్రను చేపట్టారు. ఈ యాత్రలో డివిజన్ పరిధిలోని దిన్ దయాల్ నగర్, పంచముఖి హనుమాన్ దేవాలయం, శివాలయంలో గోవులకు షెడ్డు తదితర ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా శివాలయంలో గోవులకు షెడ్డు నిర్మిస్తానని హామీ ఇచ్చారు. హామీలో భాగంగా స్థానికుల ఆధ్వర్యంలో చేపడుతున్న షెడ్డు నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. నిర్మాణ పనులు, దేవాలయంలో చేపట్టవలసిన అభివృద్ధి పనులను అడిగి తెలుసుకున్నారు. దేవాలయానికి ఎల్లప్పుడు తనవంతు సహకారం అందిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు నాగేష్, సాయిలు యాదవ్, విజయ్ భాస్కర్ రెడ్డి, వెంకటేష్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, మల్లేష్, మల్లేష్ యాదవ్, శివ రెడ్డి, రాజేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




## ప్రజల్లో ఉంటా..పార్టీ గెలుపు కృషి చేస్తా

**కాంటోన్మెన్ లో కాంగ్రెస్ ను పటిష్టం చేస్తాం: గద్దర్ వెన్నెల**

**కంటోన్మెంట్,విశాలభారతి:** ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓటమిని చవిచూసిన గద్దర్ వెన్నెల మొక్కవోని ధైర్యంతో రాజకీయాల్లో ముందడుగులు వేస్తూ ముందుకు సాగుతోంది. నియోజకవర్గం లో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడం, రాబోయే ఎంపీ ఎన్నికల్లో పార్టీని గెలిపించుకునే బాధ్యతకాంగ్రెస్ పార్టీగా మనందరిపై ఉందని దిశా నిర్దేశం చేశారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ని పటిష్టపరిచేందుకు కార్యాచరణ సిద్ధం చేశారు. పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరిని కలుపుకొని ముందుకు సాగుతూ, ఎన్నికలను ఎందుకు కార్యాచరణ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది అందులో భాగంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అందరితో సమావేశం నిర్వహించి ఎన్నికల కోసం సిద్ధం కావాలని, గెలిచేందుకు ప్రణాళికలను సిద్ధం చేశారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో ఓటమి చవిచూసిన తానుఎంపీ ఎన్నికల్లో అభ్యర్థిని గెలిపించాల్సిన బాధ్యతను గుర్తు చేశారు.రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తమకు కలిసొస్తుందని, సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సూచనలు సలహాలతో ఎంపీ ఎన్నికల్లో విజయం సాధించి కాంగ్రెస్ జెండాను ఎగరవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. మరోవైపు మల్కాజ్గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు సేవలను కూడా ఉపయోగించుకుంటామని వివరించారు. కంటోన్మెంట్ నియోజకవర్గంలో పై పూర్తి పట్టు సాధించి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజాపాలనను వారికి అందిస్తామని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంటు కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## ఈ నెల 28 నుంచి ప్రజాపాలన కార్యక్రమం

- **జనవరి 6 వరకు దరఖాస్తుల స్వీకరణ**
- **ప్రజాప్రతినిధులతో, అధికారులతో సమీక్ష**

**భీమదేవరపల్లి, విశాల భారతి:** రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆరు గ్యారంటీల అమలు కోసం అర్హుల నుంచి దరఖాస్తుల స్వీకరించడానికి ప్రభుత్వం ఈ నెల 28 నుంచి జనవరి 6 వరకు ప్రజాపాలన కార్యక్రమాన్ని చేపట్టిందని హన్మకొండ డిఆర్డిఏ పిడి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండలంలోని ప్రజాప్రతినిధులతో, అధికారులతో కలిసి మంగళవారం ఆయన అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మండలవ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ప్రజాపాలన నిర్వహించడానికి ఏర్పాట్లు చేయాలన్నారు. గ్రామంలో అధికారులతో మహాలక్ష్మి, గృహ జ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత, రైతు భరోసా తదితర పథకాల కోసం దరఖాస్తులు స్వీరిస్తామన్నారు. ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని, ప్రజల సౌకర్యార్థం కుర్చీలు, టెంట్లు, తాగునీరు, మహిళ, పురుషులకు, వికలాంగులకు వేర్వేరుగా క్యూలైన్లు తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అడిషనల్ డిఆర్డిఏ శ్రీనివాస్, ఎమ్మార్వో వెంకట భాస్కర్ ఎంపీపీ జక్కుల అనిత యంపీఓ నాగరాజు, అన్ని గ్రామాల సర్పంచులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి సభ్యులుగా యెగ్గన శ్రీనివాస్



**మంచిర్యాల, విశాల భారతి:** ప్రతిష్టాత్మకమైన తెలంగాణ రాష్ట్ర వైద్య మండలి సభ్యులుగా తొలిసారి ఉత్తర తెలంగాణ నుండి మంచిర్యాలకు చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ యెగ్గన శ్రీనివాస్ ఎన్నికయ్యారు. ఈ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా 96మంది వైద్యులు పోటీ చేయగా ఎన్నికైన 13 మందిలో డాక్టర్ శ్రీనివాస్ ఉన్నారు. డా.శ్రీనివాస్ జిల్లా కేంద్రంలోని ఎయిమ్స్ హాస్పిటల్లో ఆర్థోపెడిక్ ట్రామా, జాయింట్ రీప్లేస్మెంట్ సర్జన్ గా వైద్య సేవలు అందిస్తున్నారు. ఆయనకు ఈ పదవి దక్కడం పట్ల మంచిర్యాల ప్రజలు చుట్టుపక్కల ఉన్న గ్రామాల ప్రజలు అభినందనలు తెలుపుతున్నారు.




## సిపిఐ జెండా ఆవిష్కరణ

**మరిపెడ, విశాలభారతి:** సిపిఐ మరిపెడ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 99వ ఆవిర్భావ దినోత్సవం మరిపెడ మండల కేంద్రంలో స్థానిక గెస్ట్ హౌస్ మరిపెడ మండల సమితి ఆధ్వర్యంలో ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించడం జరిగింది. సిపిఐ పార్టీ ఆవిర్భవించి 99 వ సంవత్సరంలో నేటి వరకు కార్మిక శ్రామిక ప్రజల పక్షాన నిరంతరం పోరాటాలు చేస్తున్న కమ్యూనిస్టు పార్టీగా, 100 సంవత్సరాలు బతికున్న పార్టీ సిపిఐ పార్టీ రానన్న భవిష్యత్తు రోజులలో పార్టీ బలోపేతాన్ని చేస్తూ, ప్రజా పోరాటాలలో ముందుండి పార్టీ అభివృద్ధిని చేస్తామని పార్టీ ఆవిర్భావ దినోత్సవం పురస్కరించుకొని జెండా ఆవిష్కరణ చేయడం జరిగింది .ఈ కార్యక్రమంలో సిపిఐ మండల కార్యదర్శి మారగాని బాలకృష్ణ, సిపిఐ జిల్లా సమితి సభ్యులు ఎండి అబ్దుల్ రషీద్ ,సిపిఐ పట్టణ కార్యదర్శి మల్లెపాక య్యకన్నా, నాయకులు పోలేపాక ఎంకన్న ఏఐసిటి ఏఐటియుసి నాయకులు నారాయణ, అంజి ,రమేష్ ,శీను, యుగంధర్ ,సైదులు, వీరన్న ,తదితరులు పాల్గొన్నారు.




## ఘనంగా సిపిఐ 99వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**కల్వకుర్తి, విశాల భారతి:** కల్వకుర్తి పట్టణంలో మంగళవారం మహబూబ్ నగర్ చౌరస్తాలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) పార్టీ 99వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ పార్టీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. నియోజకవర్గ ఇంచార్జి పులిజాల పరశురాములు పార్టీ జెండాను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1925 డిసెంబర్ 26వ తేదీన కాన్పూర్ లో సిపిఐ పార్టీ ఆవిర్భవించిందని అన్నారు. ప్రతి నిత్యం సిపిఐ పార్టీ పేద ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమం లో సీపీఐ మండల నాయకులు గడ్డం శ్రీనిసులు, మూలమళ్ళ రవీందర్, వీరేశం, శివ, మోహన్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

## పేదలకు సేవ చేయడమే నా లక్ష్యం

**కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు ఆశాదీప్ రెడ్డి**



**కల్వకుర్తి, విశాల భారతి:** పేద ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు కాయితి ఆశాదిప్ రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తాండ్ర గ్రామంలో వృద్ధులకు చేతి స్టాండ్లు అందజేసి ఉదారతను చాటుకున్నారు. తన సొంత గ్రామంలో నడవడానికి ఇబ్బందులు పడుతున్న వృద్ధులకు సోమవారం రాత్రి ఆయన పరామర్శించి స్టాండ్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ తమకు ఉన్నదాంట్లో ఎంతో కొంత పేద ప్రజలకు సేవ కార్యక్రమాలకు ఉపయోగించాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అశోక్, హరీష్, సందీప్, నందు యాదవ్, మహేష్, అరుణ్, పరుశరామ్, శివ, వంశీ, ఆంజనేయులు, చంద్రయ్య, తాండ్ర గ్రామస్తులు పాల్గొన్నారు.




## స్వరాష్ట్రం కోసం ఉద్యమించిన ఘనత సిపిఐ పార్టీకే దక్కుతుంది

- **జెండా ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేసిన నాయకులు**
- **సిపిఐ చరిత్రను ప్రజలకు వివరించిన సర్పంచ్ రమేష్**

**చిగురుమామిడి, విశాల భారతి:** పేద బడుగు బలహీన వర్గాల అభ్యున్నతి కోసం నిరంతరం పనిచేస్తున్న ఏకైక పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ అని, తెలంగాణ స్వరాష్ట్రం కోసం సైతం ఉద్యమించిన ఘనత సిపిఐ పార్టీకే దక్కుతుందని సుందరగిరి గ్రామ సర్పంచ్ శ్రీమూర్తి రమేష్,గ్రామశాఖ కార్యదర్శి గందె కొమురయ్యలు తెలిపారు. సిపిఐ పార్టీ 99వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల సందర్భంగా మంగళవారం సుందరగిరిలో సిపిఐ పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి కొమురయ్య ఆధ్వర్యంలో ఆవిర్భవ దినోత్సవ వేడుకలను పెద్ద ఎత్తున నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడి, దున్నేవాడిదే భూమి అంటు ఉద్యమాలు చేసి పేదలకు భూములను పంపిణీ చేసిన ఘనత సిపిఐ పార్టీదేనని అన్నారు. దశబ్దాల కాలంగా పేద ప్రజల కోసం పని చేస్తున్న పార్టీ సిపిఐ పార్టీ అని, సిపిఐ పార్టీ చరిత్రను ప్రజలకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శ్రీమూర్తి రమేష్,గ్రామ శాఖ కార్యదర్శి గందె కొమురయ్య, వార్డు సభ్యులు కంది శంకర్,కక్కెర్ల సంజీవ్ గౌడ్,మాజీ సింగిల్ విండో డైరెక్టర్ తాళ్లపల్లి చిన్నచంద్రాయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## అయోధ్య పూజిత అక్షంతల కలశ వితరణ మహోత్సవం

**షాబాద్, విశాల భారతి:** మండలంలోని సీతారాంపూర్ గ్రామంలో అయోధ్య పూజిత అక్షంతల కలశ వితరణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భాస్కర్ యోగి పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ అయోధ్య కోసం ఎంతోమంది ప్రాణ త్యాగం చేశారు. వారందరి త్యాగం వృధా పోలేదు. అయోధ్య రామమందిర నిర్మాణం పూర్తయి, జనవరి 22వ తేదీ 2024న విగ్రహ ప్రాణ ప్రతిష్ట జరుగుతుంది. జనవరి 1వ తేదీ నుండి 15 వ తేదీ వరకు దేశమంతటా అయోధ్య రాముని పూజిత అక్షింతలు, గుడి చిత్రపటము, కరపత్రము ప్రతీ ఇంటికి అందజేయాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ రామ జన్మభూమి తీర్థక్షేత్ర మండల సంయోజక్ గూడెం రమేష్ ,గ్రామ సర్పంచ్ పాండురంగా రెడ్డి ,VHP జిల్లా ఉపధ్యక్షుడు బోజి రెడ్డి , మల్లేశ్ , ప్రవీణ్, లికిత్, రాఘవేందర్ వివిధ గ్రామాల నుంచి గ్రామ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ పంచముఖి నాగేంద్ర స్వామి ఆలయాన్ని సందర్శించి మొక్కులు చెల్లించుకున్న మంత్రి

**తొర్రూర్,విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని స్థానిక పంచముఖి నాగేంద్ర స్వామి ఆలయంలో మొక్కులు చెల్లించుకోవడానికి వచ్చిన పంచాయతీ రాజ్ &స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రివర్యులు సీతక్కకు తొర్రూరు పట్టణ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, ఆలయ పూజారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆలయ పూజారులు, వేద పండితులు పూజలు నిర్వహించి సీతక్కను ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలను అందించారు.అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ ములుగు నియోజకవర్గ ప్రజలే కాకుండా ఏ నియోజకవర్గ ప్రజలైన నా దగ్గరికి రావచ్చు అని నా శాఖ పరిధిలో ఉన్న అంశాలకు ప్రాధాన్యతలిచ్చి పరిష్కరిస్తానని అన్నారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించేలా సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి చర్యలు చేపడతామని అన్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీ పథకాలను అమలు చేస్తామని అన్న మాటను నిలబెట్టుకునేందుకు అర్హులైన ప్రతి ఒక్కరికి ఆరు గ్యారెంటీ పథకాలను అందించేందుకు సుపరిపాలన సాగించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఈ ప్రాంత ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో యశస్విని రెడ్డిగెలుపు కొరకు ప్రచారం నిర్వహించిన సందర్భంగా నన్ను ఎంతో ఆదరించారని, ఆప్యాయత అనురాగాలను ప్రదర్శించారని వారి ఆదరణను నేను ఎప్పటికీ మరువలేనని అన్నారు. కాంగ్రెస్ పార్టీని ఆదరించి యశస్విని రెడ్డిని గెలిపించిన మీ సమస్యలు తీర్చేందుకు మీకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు ఓలేటి యాదగిరాచార్యులు, గీతాచార్యులు, మధు శర్మ ఆలయ కమిటీ సభ్యులు గోపారపు నాగేశ్వరరావు, ప్రసాద్ లక్ష్మణాచార్యులు తదితరులు పాల్గొన్నారు.



# పొంగులేటికి స్వాగతం పలికిన ప్రభుత్వ విప్



**రామచంద్రనాయక్**

**మరిపెడ,విశాల భారతి:** మండల కేంద్రంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వరంగల్ వెళ్తున్న గ్రామంలో అతిథి గృహం వద్ద కాసేపు ఆగారు. వారికి డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్రనాయక్ పుష్ప గుచ్చం అందించారు. కాసేపు పలు విషయాల గురించి చర్చించారు. వారి వెంట మండల అధ్యక్షులు పెండ్లి రఘువీర్ రెడ్డి, యుగేందర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.



# ఆడుదాం ఆంధ్ర గేమ్స్

**ఓపెనింగ్ చేసిన గుండాల సచివాలయ ప్రజా ప్రతినిధులు**

**భద్రాచలం, విశాలభారతి:** ఎటపాక మండలం గుండాల సచివాలయ పరిధిలో జరిగిన ఆడుదాం ఆంధ్ర అనే ప్రోగ్రాంకు గుండాల సర్పంచ్ గుండి సీతాలక్ష్మి, గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకటరామిరెడ్డి, హాజరై ప్రోగ్రాంను ప్రారంభించారు. ఈ ప్రోగ్రామ్ను ఉద్దేశించి గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకట రామిరెడ్డి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆడుదాం ఆంధ్ర అనే ప్రోగ్రామ్ను, భారీగా సక్సెస్ చేయాలని, ప్రభుత్వం భావిస్తుందని, ఆడుదాం ఆంధ్రాలో భాగంగా, పలు సంస్థలతో ఒప్పందాలు చేసుకుందనీ ఏపీ ప్రభుత్వం . చెన్నై సూపర్ కింగ్స్, ప్రో కబడ్డీ లీగ్, ప్రైమ్ వాలీబాల్ లీగ్, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్, ఆంధ్ర కోకో అసోసియేషన్, ఆంధ్ర వాలీబాల్ అసోసియేషన్, ఏపీ బ్యాడ్మింటన్ అసోసియేషన్, తోను ఒప్పందాలు చేసుకుందని తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో యువ క్రీడాకారులను ప్రోత్సహించేందుకు, గ్రామ మండల స్థాయి కమిటీల పర్యవేక్షణలో నిర్వహించనున్నారు. ఈ ఆటలు, గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు ఐదు దశల్లో జరుగుతాయని తెలిపారు , ఈ కార్యక్రమంలో గుండాల ఎంపీటీసీ గొంగడి వెంకట రామిరెడ్డి, గుండాల సర్పంచ్ గుండి సీతాలక్ష్మి, సచివాలయ సెక్రటరీలు, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.



# జానారెడ్డిని సన్మానించిన రైస్ మిల్లర్లు

**మిర్యాలగూడ, విశాలభారతి:** నల్గొండ జిల్లా మిర్యాలగూడ ప్రాంత పర్యటనకు మంగళవారం సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి వచ్చారు. కాగా జానారెడ్డిని రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్లర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కర్నాటి రమేష్, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి గౌరు శ్రీనివాస్, వెంకట రమణ చౌదరి, రాష్ట్ర నాయకులు బండారు కుశలయ్య, రేపాల మధు సూధన్ తదితరులున్నారు.



# స్త్రీనిధి పథకాన్ని ఎర్రబెల్లి ట్రస్టు చేసిన సేవగా మార్చిన మాజీ మంత్రి

**తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) సభ్యులు బక్క జడ్సన్**

**తొర్రూరు, విశాల భారతి:** టిఆర్ఎస్ ప్రభుత్వంలో ఎర్రబెల్లి దయాకర్ రావు శ్రీనిధి ఎండి విద్యాసాగర్ రెడ్డి కలిసి శ్రీనిధిలోని నిధులను దోచుకున్నారు బక్క జడ్సన్ తెలిపారు. స్త్రీనిధి పథకం ఖజానాను ఖాళీ చేస్తూ ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు చేసినట్లుగా ప్రజలను మాయ మాటలతో మోసం చేసి ప్రభుత్వం అందజేసిన స్త్రీ నిధి డబ్బులను మొత్తం ఖాతాలో వేసుకొని ప్రజలను మోసం చేసిన ఘనత మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు దని.ఈ స్త్రీ నిధి లో జరిగిన అవకతవకల పై ప్రత్యేక కమిటీ వేసి విచారణ జరిపించి ప్రభుత్వ సొమ్మును ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు చేసినట్లు మభ్యపెట్టిన మాజీ మంత్రిపై మరియు ఈ తథంగానికి సహకరించిన జిల్లా ఉన్నత అధికారులపై కఠిన చర్యలు తప్పవని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ టిపిసిసి సభ్యులు బక్క జడ్సన్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం స్థానిక తొర్రూరు డివిజన్ కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో జడ్సన్ మాట్లాడుతూ గత కెసిఆర్ ప్రభుత్వం చేసిన అవకతవకలపై అనేక కేసులు పెట్టడం జరిగిందని అన్నారు. రాష్ట్రంలో ఎక్కడ జరగని విధంగా పాలకుర్తి నియోజకవర్గం లో స్త్రీ నిధి నుండి విడుదలైన ప్రభుత్వ ఖజానాను ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్టు ద్వారా సేవ చేసినట్టు లక్షలకు లక్షలు సొమ్ము వెనకేసిన ఘనత రాష్ట్రంలో ఎర్రబెల్లి దయాకర్ రావు దే నని అన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వంలో స్త్రీ నిధి సంస్థలో కేసీఆర్ ప్రభుత్వానికి ఎర్రబెల్లి దయాకర్ రావులకు భయపడి ఉద్యోగాలకు రాజీనామా చేయించి తమకు అనుకూలమైన వారిని నియమించుకొని స్త్రీ నిధిని మాయం చేసిన ఎర్రబెల్లి దయాకర్ రావు పై సమగ్ర విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకుంటుందని అన్నారు. రాష్ట్రంలో గులాబీ కండువా కప్పుకున్న నాయకుల్లాగా పనిచేసిన జిల్లా ఉన్నతాధికారులు వారు చేసిన ఆగడాలపై ప్రత్యేక విచారణ కొనసాగుతుందని వారిపై కూడా చర్యలు తప్పవని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ తొర్రూరు మండల అధ్యక్షులు సుంచు సంతోష్, సీనియర్ నాయకులు నకిరేకంటి కొమురయ్య, వేర్పుల వెంకన్న, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# పద్మశాలిలకు గుర్తింపు కార్డులు జారీ చేయాలి



**పాలకుర్తి, విశాలభారతి:** అర్హులైన పద్మశాలి కుటుంబాలకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని పద్మశాలి యువజన సంఘం జిల్లా ముఖ్య నాయకుడు, కాంగ్రెస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి బైరు భార్గవ్ ప్రభుత్వాన్ని కోరారు. మంగళవారం మండల కేంద్రంలోని సంఘం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పద్మశాలిలు వివక్ష గురయ్యారని అన్నారు. వాళ్లకు గుర్తింపు కార్డులు ఇవ్వకుండా ప్రభుత్వం జాప్యం చేయడంతో చాలా మంది నిరుపేద పద్మశాలి కుటుంబాలు నానా ఇబ్బందులకు గురయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. పద్మశాలిల సమస్యల గురించి అప్పుడు మంత్రిగా ఉన్న ఎర్రబెల్లి దయాకర్ రావుకు ఎన్నోసార్లు వినితి పత్రం ఇచ్చామని, కానీ ఆయన ఏమాత్రం పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ క్రమంలోనే ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పద్మశాలిలు అండగా నిలబడ్డారని అన్నారు. 50 ఏళ్లు నిండిన ప్రతి పద్మశాలి వ్యక్తికి గుర్తింపు కార్డు ఇచ్చి పెన్షన్ సౌకర్యం కల్పించాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కోరారు.



# విద్యారంగ సమస్యలను పరిష్కరించాలి

**ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డికి ఎస్ ఎఫ్ ఐ నేతల వినతి**

**మిర్యాలగూడ, విశాలభారతి:** తెలంగాణ రాష్ట్రంలో విద్యారంగ సమస్యలను పరిష్కరించి పెండింగ్ లో ఉన్న స్కాలర్ షిప్స్, మెస్ చార్జీలను తక్షణమే విడుదల చేయుటకు కృషి చేయాలని కోరుతూ మంగళవారం ఎస్ఎఫ్ఐ మిర్యాలగూడ డివిజన్ కమిటీ నేతలు ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డిని ఆయన నివాసంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నల్గొండ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ మాట్లాడారు. మహాలక్ష్మీ స్కీం లో భాగంగా పేద విద్యార్థులకు ఫ్రీ బస్ పాస్ అందించాలన్నారు. గురుకులాలు, కస్తూరిభా సంక్షేమ హాస్టళ్లకు సొంత బిల్డింగ్ లను నిర్మించాలన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతన భవనం ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నల్గొండ జిల్లా ఉపాధ్యక్షుడు కుర్ర సైదా నాయక్, జిల్లా కమిటీ సభ్యులు జగన్ వీరన్న సంపత్, నుమాన్, నాయకులు మనోహర్, అనిల్, కోటేష్, అఖిల్, సంతోష్, సాయి, ఆనంద్, ప్రసాద్, నగేష్ ఉన్నారు.



# బీఆర్ఎస్ రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చింది

- 11 స్థానాలను గెలిపించిన కాంగ్రెస్ సైన్యానికి కృతజ్ఞతలు
- రానున్న పార్లమెంటు ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలి
- సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి

**మిర్యాలగూడ, విశాలభారతి:** సంక్షేమ పథకాల పేరిట గత బీఆర్ఎస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని సీఎల్పీ మాజీ నేత కుందూరు జానారెడ్డి మండిపడ్డారు. మంగళవారం మిర్యాలగూడలో పర్యటించిన ఆయన స్థానిక పార్టీ ఆఫీస్ లో కార్యకర్తలతో సమావేశమయ్యారు. సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఉన్న 12 నియోజకవర్గాల్లో 11 స్థానాల్లో కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించిన పార్టీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో సమావేశంలో డీసీసీ అధ్యక్షులు కేతవత్ శంకర్ నాయక్ , పీసీసీ సభ్యులు చిరుమర్రి కృష్ణయ్య , పగిడి రామలింగయ్య యాదవ్ , రాష్ట్ర నాయకులు దీరావత్ స్కైలాబ్ నాయక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గాయం ఉపేందర్ రెడ్డి, మిర్యాలగూడ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పొదిల శ్రీనివాస్ , తలకొప్పుల సైదులు , మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు గోపగాని మాధవి, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు సలీం, ఎన్ ఎస్ యూఐ జిల్లా అధ్యక్షులు ఆరిఫ్, ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షులు నర్సింగ్ వెంకటేశ్వర్లు ఉన్నారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాతృమూర్తి వెంకట్రావమ్మ గత నెలలో మృతి చెందారు. కాగా లక్ష్మారెడ్డి నివాసానికి చేరుకున్న జానారెడ్డి ... వెంకట్రావమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

# విద్యార్థి మృతి

**చికిత్స పొందుతూ మృతి చెందిన సాయి తేజ**



**చిట్యాల, విశాలభారతి:** సోమవారం రోజు చిట్యాల పట్టణ పరిధిలోని బాల నరసింహస్వామి స్టేజి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కామినేని ఇనిస్ట్యూట్ లో డెంటల్ సైన్స్ 2వ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు తీవ్రంగా గాయపడి కామినేని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిలో బిరుదు సాయి తేజ అనే విద్యార్థికి తీవ్ర గాయాలు కావడంతో హైదరాబాద్ లోని యశోద హాస్పిటల్ కి తరలించి లో చికిత్స అందిస్తుండగా నిన్న రాత్రి 9గం.లకి మృతిచెందడం జరిగింది. యశస్వి అనే మరో విద్యార్థికి కామినేని ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నారు. మృతుడు మహబూబ్ నగర్ జిల్లా జడ్చర్ల మండలానికి చెందిన వ్యక్తి అని పోలీసులు తెలిపారు.

# ఎంపీ టికెట్ ఇవ్వాలి



**మంగ పెల్లి ఆశయ్య**

**తొర్రూరు, విశాలభారతి:** పట్టణ కేంద్రానికి చెందిన మంగళపెల్లి ఆశయ్య వరంగల్ పార్లమెంట్ బరిలో ఉన్నానని తెలిపారు. గత 30 సంవత్సరాలనుండి రాజకీయాల్లో అనేక ఓడి దుడుకులని ఎదుర్కొన్నానని సామాజిక వర్గమైన ఎస్సి నేపథ్యమున్న తాను ఎలాంటి పదవులని కోరలేదని తనకంటే వయసులో, అనుభవంలో చిన్నవారికి పదవులు ఇచ్చిన తాను పార్టీకి కట్టు బానిసలాగా పనిచేశానని వారు తెలిపారు. అలాగే గతంలో తొర్రూర్ MPTC గా తొర్రూర్ పట్టణ మరియు మండల ప్రజలకు తనదైన శైలిలో సేవలు అందించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ సుధాకర్ రావు నాయకత్వంలో తెలుగుదేశం పార్టీ లో ఉంటూ పార్టీ అభివృద్ధి కోసం తన వంతు సహాయ సహకారాలు అందిస్తూ సుధాకర్ రావు శిష్యుడుగా, తొర్రూర్ మాజీ ఎంపీపీ కర్నే సోమయ్య కి ప్రధాన అనుచరుడిగా తనదైన ముద్ర వేసుకున్నారు. అదేవిధంగా తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమంలో చురుగ్గా పాల్గొని లాఠీ దెబ్బలు తిని అరెస్ట్ కూడా అవ్వడం జరిగింది అని, తెలంగాణ సాధించుకొనుటలో తనదైన శైలిలో ఉద్యమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. అందులో భాగంగా మాజీమంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావుతో టిఆర్ఎస్ పార్టీలో చేరి పార్టీకి నమ్మకంగా ఉంటూ పార్టీ అప్పచెప్పిన బాధ్యతలను నిజాయితీతో, నిబద్ధతతో నిర్వర్తించి మంచి పేరు తెచ్చుకోవడం జరిగింది అని వారు తెలిపారు. సామాజిక సమీకరణంలో భాగంగా వరంగల్ పార్లమెంటు స్థానాన్ని ఎస్సి సామాజిక వర్గానికి కేటాయించడంతో పార్టీకి నేను చేసిన సేవకి కృతజ్ఞతా భావంతో ఎంపీ టికెట్ ను ఆశిస్తున్నాను అని వారు తెలిపారు. అధిష్టానం పార్టీకి తను చేసిన సేవలను చేసిన గుర్తుంచుకొని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో వరంగల్ స్థానాన్ని తనకు కేటాయించాలని ఆశాభావం వ్యక్తం చేశారు.




# జిల్లా నాయి బ్రాహ్మణ సేవాసంఘం జిల్లా కమిటీ ఎన్నిక

**కల్వకుర్తి, విశాల భారతి:** జిల్లా నాయి బ్రాహ్మణ సేవా సంఘం జిల్లా కమిటీని మంగళవారం నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఎన్నికల్లో అచ్చంపేట పట్టణానికి చెందిన జిల్లా అధ్యక్షులుగా కానుగుల శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా కొల్లాపూర్ పట్టణానికి చెందిన టి. సురేష్, కోశాధికారిగా కల్వకుర్తి పట్టణానికి చెందిన కానుగుల శ్యామ్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరితో పాటు జిల్లా సభ్యులు, గౌరవాధ్యక్షులుగా వనపట్ల సుబ్బయ్య, ఉపాధ్యక్షులు కానుగుల జంగయ్య లు ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా ఉన్న నాయి బ్రాహ్మణ సభ్యులు దాదాపుగా 500 మంది పాల్గొన్నారు. కల్వకుర్తి పట్టణానికి చెందిన అధ్యక్షుడు మురళి, కార్యదర్శి భాస్కర్, కోశాధికారి రవి, సహాయ కార్యదర్శి జంపుల పర్వతాలు, ముఖ్య సలదారుడు జంపుల చిన్న జంగయ్య, శేఖర్, సైదులు, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.




# కళ్యాణ మహోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే

**నార్కట్ పల్లి, విశాలభారతి:** మండలంలోని గోపలాయపల్లి గ్రామ పరిధిలో కొండపైన స్వయంబుగా వెలసిన శ్రీవారిజాల వేణుగోపాలస్వామి దేవస్థానంలో నిర్వహించిన స్వామివారి కళ్యాణ మహోత్సవంలో ముఖ్య అతిథిగా నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కి దేవస్థాన వ్యవస్థాపక అధ్యక్షులు కోమటిరెడ్డి మోహన్ రెడ్డి స్వాగతం పలికారు. రుక్మిణి సత్యభామ సమేత శ్రీ కృష్ణుని కళ్యాణ మహోత్సవంలో ఎమ్మెల్యే పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు ఎమ్మెల్యేకి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం దేవస్థాన పరిసర ప్రాంతాల్లో కలియ తిరుగుతూ పరిశీలించారు. ఈ కార్యక్రమం లో మండల కాంగ్రెస్ అధ్యక్షులు బత్తుల ఉషయ్య, వట్టిమర్తి సర్పంచ్ బుర్రి రవీందర్ రెడ్డి, వివిధ హోదాలలో ఉన్న నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రి సోదరునికి ఘన స్వాగతం



**కల్వకుర్తి, విశాల భారతి:** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సోదరుడు కొండల్ రెడ్డికి మంగళవారం పట్టణ సమీపంలోని కొట్ర చౌరస్తాలో పట్టణ కాంగ్రెస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. హైదరాబాద్ నుండి మద్దిమడుగు వెళ్తున్న కొండల్ రెడ్డిని కల్వకుర్తి గాంధీనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సోషల్ ఆక్టివ్ పర్సన్ సయ్యద్ ఏజాస్ అలీ, రాష్ట్ర వికలాంగుల చైర్మన్ అబ్దుల్ సాదిక్ అలీ, మైనారిటీ నాయకులు సయ్యద్ ఖుద్దుస్ లు కొండల్ రెడ్డికి అభినందనలు తెలిపారు.

# బాధిత కుటుంబానికి అమ్మ ట్రస్ట్ చేయూత



**పాలకుర్తి, విశాలభారతి:** మండల కేంద్రానికి చెందిన రాపాక జయలక్ష్మి ఇటీవల మరణించగా మంగళవారం బాధిత కుటుంబాన్ని అమ్మ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ యతిపతి శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి జీడి హరీశ్ పరామర్శించారు. ఈ సందర్భంగా రాపాక నాగరాజు సహకారంతో ట్రస్ట్ ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి 25 కేజీల బియ్యం, 15 లీటర్ల ఆయిల్, కూరగాయలతో పాటు ఇతర నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ సందర్భంగా యతిపతి శ్రీకాంత్ మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని అన్నారు. భవిష్యత్తులో వారికి ఏం సహాయం కావాలన్నా చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వర్రె కుమార్, రాపాక శ్రీహరి తదితరులు పాల్గొన్నారు.

విశాల భారతి
తెలుగు దిన పత్రిక

# సినిమా

www.vishalabharati.com
epaper:vishalabharati.com

బుధవారం, 27.12 2023 హైదరాబాద్


vishalabharathi Telugu Daily



## ఈగల్ లో ప్రేక్షకులు కొత్త రవితేజని చూస్తారు

మాస్ మహారాజా రవితేజ సెన్సేషనల్ బ్లాక్ బస్టర్ హిట్ 'ధమాకా'. శ్రీలీల హీరోయిన్ గా త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన ఈ చిత్రం ఏడాది పూర్తి చేసుకుంది. మరోవైపు పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మాణంలో రవితేజ తాజా చిత్రం 'ఈగల్' 2024 సంక్రాంతి కానుకగా జనవరి 13 ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవలే విడుదలైన ఈ చిత్రం ట్రైలర్ ట్రెమండస్ రెస్పాన్స్ తో 'ఈగల్' పై అంచనాలని మరోస్థాయికి తీసుకెళ్ళింది. ఈ సందర్భంగా 'ఈగల్ x ధమాకా' సెలబ్రేషన్స్ ని గ్రాండ్ గా నిర్వహించారు మేకర్స్. ఈ వేడుకలో 'ధమాకా' టీమ్‌కు మెమెంటోలు అందజేశారు. 'ఈగల్ x ధమాకా' సెలబ్రేషన్స్ లో మాస్ మహారాజా రవితేజ మాట్లాడుతూ.. నిర్మాత విశ్వప్రసాద్ గారికి అభినందనలు. ధమాకా నిన్నో మొన్నో విడుదలైనట్లుంది. ఏడాది అయిందంటే నమ్మబుద్ధి కావట్లేదు. సంగీత దర్శకుడు భీమ్స్ ఇచ్చిన పాటలకు.. తనకి మంచి గుర్తింపు వస్తుందని సినిమా విడుదలకాక ముందే బలంగా నమ్మాను. అదే నిజమైంది. వరుస సినిమాలతో బిజీగా ఉన్నాడు. మనకున్న సంగీత దర్శకుల్లో తనుకూడా ఒక బెస్ట్ మ్యూజిక్ డైరెక్టర్. మళ్లీ మేం కలిసి పనిచేయబోతున్నాం. శ్రీలీల పెద్ద హీరోయిన్ అవుతుందని చెప్పాను. ఊహించినట్లే శ్రీలీల హీరోయిన్‌గా అద్భుతంగా రాణిస్తోంది. ఆది, మంగ్లీ, మౌనిక టీం అందరికి పేరుపేరునా అభినందనలు. 'ఈగల్' సినిమా విషయానికి వస్తే,.. కార్తిక్ ని కెమరామ్యాన్ గా చూశాం. ఇప్పుడు దర్శకుడిగా చూడబోతున్నాం. ఈ సినిమాతో కార్తిక్ కి చాలా బ్రైట్ ఫ్యూచర్ ఉంటుందని నా బలమైన నమ్మకం. ఒక్కటి మాత్రం చెప్పగలను.. ఇందులో ప్రేక్షకులకు ఒక కొత్త రవితేజను చూపించబోతున్నాడు. అది నాకు చాలా తృప్తిని ఇచ్చింది. ఈ సినిమాలో కొత్త కావ్యా థాపర్ కనిపిస్తుంది. ఆ పాత్ర నాకు చాలా నచ్చింది. దేవ్ జాంద్ చాలా మంచి మ్యూజిక్ ఇచ్చాడు. తను గొప్ప స్థాయికి వెళ్ళాలని కోరుకుంటున్నాను. అవసరాల శ్రీనివాస్ చాలా సెన్సిబుల్ పర్సన్. విశ్వగారి ఆల్ ది వెరీ బెస్ట్. మా ప్రయాణం కొనసాగుతుంది'' అన్నారు.

## ఇన్‌స్టంట్ కాఫీలా ఇదేంటి సామ్ ?



సమంత రూత్ ప్రభు.. వ్యక్తిగతంగా వృత్తిగతంగా ఎమోషనల్ జర్నీని బ్యాలెన్స్ చేస్తున్న తీరు ఆశ్చర్యం కలిగించక మానదు. కొన్ని ఎదురు దెబ్బలు తిన్నా అవేవీ తన కెరీర్ ని ప్రభావితం చేయకుండా సామ్ ఎంతో జాగ్రత్తపడుతోంది. తన జీవితంలో ప్రతి నిమిషం ఆనందాన్ని ఉద్వేగాన్ని దాచుకోకుండా ప్రతిసారీ సోషల్ మీడియాల్లో ఓపెనవుతూనే ఉంది. తాజాగా సోషల్ మీడియాలో ఒక అందమైన ఫోటోని షేర్ చేసింది. 'ఇన్‌స్టంట్ కెమెరా ఫేస్' అని దీనికి క్యాప్షన్ ఇచ్చింది. ఈ ఫోటోలో కెమెరా వైపు చూస్తూ నవ్వుతూ కనిపించింది సమంత. టైటిల్ కి తగ్గట్టే ఇన్ స్టంట్ కాఫీలా ఇన్ స్టంట్ క్లిక్ ఎంతో అందంగా కుదిరింది. బ్యాక్ గ్రౌండ్ లైటింగ్ స్కీమ్ ఈ ఫోటోని ప్రత్యేకంగా మార్చింది. బిస్కెట్ కలర్ దుస్తులకు తగ్గట్టుగా నేపథ్యంలో కాంతి ఇంచుమించు అదే రంగులో కలిసిపోవడంతో యాంబియెన్స్ ప్రత్యేకంగా మారింది. Also Read - హీరో కి రూ.70 కోట్లు, దర్శకుడికి రూ.200 కోట్లు! ఇక తన క్యాప్షన్ లో 'అడపాదడపా ఉపవాసం' అని రాసింది. అయితే ఉపవాస దీక్ష దేనికోసం? బయట వండినవి తినకూడదని కూడా సమంత సూచించింది. చాలా కాలంగా సమంత తనకు డెర్మటోమయోసిటిస్‌తో బాధపడుతున్న సంగతి తెలిసిందే. దీనికోసం అమెరికా సహా పలు దేశాల్లో చికిత్స తీసుకుంది. నిరంతరం జిమ్ చేస్తూ ఆహారనియమాలు పాటిస్తూ తన అనారోగ్య సమస్యను తగ్గించడంలో విజయం సాధించింది. మంచి ఆహార నియమాలు, కఠిన వ్యాయామం, సంతోషంగా ఉండడం తనని తిరిగి కోలుకునేలా చేస్తోంది. Also Read - రవితేజ పాత సినిమా.. హడావుడి బాగానే ఉంది.. కెరీర్ మ్యాటర్ కి వస్తే.. సమంత నటించిన ఖుషి ఇప్పటికే రిలీజైంది. కొంత గ్యాప్ తీసుకుని మయోసైటిస్ చికిత్సను కొనసాగించింది. ఇప్పుడు తిరిగి పని(నటన)లో చేరబోతోంది. తదుపరి 'సిటాడెల్' ఇండియా వెర్షన్ ప్రమోషన్స్ కోసం సమంత సిద్ధమవుతోందని తెలిసింది. ఈ చిత్రంలో బాలీవుడ్ యువహీరో వరుణ్ ధావన్‌తో కలిసి నటిస్తోంది. తెలుగు కుర్రాళ్లు రాజ్ అండ్ డీకే దీనికి కర్తలు. అలాగే సమంత తన తొలి హాలీవుడ్ చిత్రంలో నటించాల్సి ఉంది. 'ఓ బేబి' (సమంత కథానాయిక) నిర్మాతలు దీనిని నిర్మిస్తారు.



## గీతా ఆర్ట్స్ తండేల్ ఆడ్రినలిన్ పంపింగ్ షెడ్యూల్ బిగిన్స్..

యువ సామ్రాట్ నాగ చైతన్య, సక్సెస్ ఫుల్ డైరెక్టర్ చందూ మొండేటి, ప్రముఖ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ క్రేజీ కాంబినేషన్‌లో మోస్ట్ ఎవైటెడ్ ఫిల్మ్ 'తండేల్' రెగ్యులర్ షూటింగ్ కొద్ది రోజుల క్రితం ఉడిపిలో ప్రారంభమైంది. అల్లు అరవింద్ సమర్పణలో నిర్మాత బన్నీ వాసు ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. షూటింగ్ జరుగుతున్న ఈ లెన్తీ షెడ్యూల్‌లో టీమ్ కొన్ని కీలకమైన సన్నివేశాలు, యాక్షన్ పార్ట్స్ ని షూట్ చేస్తున్నారు. ప్రస్తుతం సముద్రం మధ్యలో అడ్రినలిన్ పంపింగ్ సీక్వెన్స్ చిత్రీకరిస్తున్నారు. టీమ్ షేర్ చేసిన ఫోటోలో నాగ చైతన్య సముద్రం వైపు నడుస్తూ ఆనందంగా కనిపిస్తున్నారు. మేకర్స్ త్వరలో కొన్ని ఎక్సయిటింగ్ అప్‌డేట్‌లతో రానున్నారు. కంప్లీట్ మేకోవర్ అయిన నాగ చైతన్య ఈ సినిమాలో మునుపెన్నడూ లేని గెటప్‌లో కనిపించనున్నారు. షూట్ ప్రారంభించడానికి ముందు ఇంటెన్స్ ట్రైనింగ్, హోంవర్క్ చేశారు. యదార్థ సంఘటనల ఆధారంగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో నాగ చైతన్య సరసన సాయి పల్లవి హీరోయిన్‌గా నటిస్తోంది. తండేల్ పూర్తిగా భిన్నమైన నేపథ్యంలో సాగే ప్రేమకథ.

## సలార్ సీజ్ ఫైర్‌ను మించి సలార్ పార్ట్ 2 ఉంటుంది

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ టైటిల్ పాత్రలో నటించిన భారీ బడ్జెట్ యాక్షన్ థ్రిల్లర్ 'సలార్ పార్ట్ 1 సీజ్ ఫైర్'. అన్‌కాంప్రమైజ్డ్ బడ్జెట్‌తో అందరూ ఆశ్చర్యపోయే ప్రొడక్షన్ వేల్యూస్‌తో సినిమాలను నిర్మించే ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిలిమ్స్ బ్యానర్‌పై సెన్సేషనల్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఈ సినిమా రూపొందించారు. మోస్ట్ అవెయిటెడ్ మూవీగా అనౌన్స్‌మెంట్ రోజు నుంచే ఎప్పుడెప్పుడు సినిమా వస్తుందా అనేంత రేంజ్‌లో ఎక్స్‌పెక్టేషన్స్‌ను పెంచిన ఈ సినిమా డిసెంబర్ 22న ప్రపంచ వ్యాప్తంగా విడుదలై బాక్సాఫీస్ దగ్గర కలెక్షన్స్ సునామీని క్రియేట్ చేస్తోంది. సలార్ సీజ్ ఫైర్ చిత్రంలో రాధా రమ పాత్ర చేసిన శ్రియా రెడ్డి.. సినిమా గురించి ఆసక్తికరమైన విషయాలను తెలియజేశారు... ప్రశాంత్ నీల్ సింపుల్‌గా సలార్ గురించి చెప్పినప్పుడు ముందు వద్దన్నాను. కానీ ఆ సమయంలో నేను సినిమాలు చేయకూడదని అనుకున్నాను. అయితే నీల్ మాత్రం తన పట్టు వదల్లేదు. నన్ను నటించాలన్నారు. ఓసారి స్క్రిప్ట్ విని నిర్ణయం తీసుకోమని అన్నారు. హీరో ఎవరైనా పర్లేదు. నా క్యారెక్టర్‌కి ప్రాధాన్యం ఉండాలని చెప్పాను. లేదు నీ రోల్ చాలా బావుంటుంది నన్ను నమ్ము అన్నారు. నిజానికి ఒరిజినల్ స్క్రిప్ట్‌లో నా క్యారెక్టర్ లేదు. అయితే ప్రశాంత్ నీల్‌గారు సలార్ మీద వర్క్ చేస్తున్నప్పుడు లేడీ విలన్ ఉంటే బావుంటుందని భావించారు. నీల్‌గారికి నా పాత్రను ఏదో విలనీగా, అరుస్తున్నట్లు చూపించాలనే ఉద్దేశం లేదు. విలనిజం టచ్ ఉంటూనే అందంగా కనిపించేలా నా పాత్రను ఆయన డిజైన్ చేసుకున్నారు. ముందు నుంచి అదే విషయాన్ని ఆయన చెబుతూ వచ్చారు. రాధా రమ పాత్రను చూసిన తర్వాత ఇండస్ట్రీ నుంచి చాలా మంది ఫోన్ చేసి అభినందించారు. సలార్ సీజ్ ఫైర్‌లో నా పాత్ర పెద్దగా కనిపించదు. సెకండా పార్ట్‌లో ఎక్కువగా కనిపిస్తాను. సలార్ సీజ్ ఫైర్ ను మించేలా సెకండ్ పార్ట్ ఉంటుంది.



: శ్రియా రెడ్డి

## జనవరి 5న ప్రేమకథ



కిషోర్ కేఎస్ డి, దియా సితెపల్లి హీరో హీరోయిన్లుగా నటించిన సినిమా "ప్రేమకథ". ఈ చిత్రాన్ని టాంగా ప్రొడక్షన్స్ ఎల్ఎల్ పీ, సినీ వ్యాలీ మూవీస్ సంయుక్తంగా నిర్మించాయి. విజయ్ మట్టపల్లి, సుశీల్ వాజపిల్లి, శింగనమల కల్యాణ్ నిర్మాతలు. ఉపేందర్ గౌడ్ ఎర్ర సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. శివ శక్తి రెడ్ డీ దర్శకత్వం వహించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న "ప్రేమకథ" సినిమా జనవరి 5న గ్రాండ్ గా థియేటర్స్ లో రిలీజ్ కు రెడీ అవుతోంది. ఫస్ట్ లుక్ పోస్టర్ నుంచి ట్రైలర్ దాకా ఆడియెన్స్ లో ఇంట్రెస్ట్ క్రియేట్ చేసింది "ప్రేమకథ" సినిమా. ఈ మూవీ నుంచి రిలీజ్ చేసిన 'ఎవడు మనోడు...' లిరికల్ సాంగ్ తో పాటు ట్రైలర్ కు మంచి రెస్పాన్స్ వచ్చింది. వైవిధ్యమైన లవ్ స్టోరీతో నేటితరం యువ ప్రేక్షకులకు నచ్చేలా రూపొందిన "ప్రేమకథ" సినిమాకు థియేటర్స్ లోనూ మంచి ఆదరణ దక్కుతుందని మూవీ టీమ్ నమ్మకంతో ఉన్నారు.

## మంచు మనోజ్, భూమా మౌనిక లాంఛ్ చేసిన నమస్తే వరల్డ్ బ్రాండ్ ను టాయ్స్

మంచు మనోజ్, భూమా మౌనిక మంచు నమస్తే వరల్డ్ బ్రాండ్ తో చిన్నారుల బొమ్మలు కార్టూన్, యానిమేషన్ రూపంలో తీసుకువచ్చేందుకు సిద్ధమయ్యారు. ఈ మేరకు హైదరాబాద్ ప్రసాద్ ఐమ్యాక్స్ థియేటర్ లో నమస్తే వరల్డ్ బ్రాండ్ టాయ్స్ pop up store ను ప్రారంభించారు. ఈ సందర్భంగా నమస్తే వరల్డ్ సీఈవో భూమా మౌనిక మంచు మాట్లాడుతూ.. పిల్లల కోసం వచ్చిన ఆలోచన నమస్తే వరల్డ్ తో ముందుకు వచ్చింది... దినికి పూర్తి సహకారం అందించిన నా భర్త మంచు మనోజ్ అందించిన స్ఫూర్తితోనే ముందుకు వెళ్ళానని... నమస్తే వరల్డ్ సీఈవో భూమ మౌనిక తెలిపారు. భారతీయ హస్తకళ నైపుణ్యం, మహిళా సాధికారత మరియు స్కిల్ డెవలప్మెంట్ తో నమస్తే వరల్డ్ ద్వారా ఉపాది కల్పించి.. దేశ ప్రతిభను ప్రపంచ స్థాయికి తీసుకువేళ్తామని భూమా మౌనిక మంచి స్పష్టం చేశారు. ఈ నమస్తే వరల్డ్ స్టార్టప్ కు సహకరించిన రిలైన్స్ సంస్థకు ప్రత్యేక దన్యావాదలు తెలిపారు. నమస్తే వరల్డ్ పూర్తి స్థాయిలో కృషి చేసిన అందరికి అభివాదాలు తెలిపారు. ఈ సందర్భంగా సీఐవో మంచు మనోజ్ మాట్లాడుతూ.. మన ఇప్పటి వరకు విదేశాలకు చెందిన కల్చర్ ను అలవాటు చేసుకున్నామని.. ఇప్పుడు ఇండియన్ కల్చర్ ను ప్రమోట్ చేసేందుకు తనవంతుగా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. మన దేశంలో గొప్పే సంస్కృతి ఉందని.. ఒక్కో కథ ఉందన్నారు. మన సంస్కృతి సాంప్రదాయాలు, కళలను వెలికి తీసేందుకు ఇది చక్కటి ఫ్లాట్ ఫాంగా నిలుస్తుందన్నారు. తనకు చిన్నప్పటి నుండి బొమ్మలు వేయడం అలవాటైందని.. ఇద్దరం కలిసి నమస్తే వరల్డ్ బ్రాండ్ పేరుతో ముందుకు వస్తున్నామన్నారు. సినిమాల్లో ఆదరించినట్లుగానే... ఈ కొత్త బిజినెస్ లో ఆదరించాలని కోరారు.




## బబుల్‌గమ్ లో నా పాత్ర అందరికీ నచ్చుతుంది

ట్యాలెంటెడ్ డైరెక్టర్ రవికాంత్ పేరేపు దర్శకత్వంలో రోషన్ కనకాల హీరోగా పరిచయం అవుతున్న చిత్రం 'బబుల్‌గమ్'. మానస చౌదరి హీరోయిన్ గా నటిస్తోంది. ఇప్పటికే ఈ సినిమా టీజర్, ట్రైలర్, పాటలు ట్రెమండస్ రెస్పాన్స్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేసింది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి మహేశ్వరి మూవీస్ నిర్మిస్తున్న ఈ సినిమా డిసెంబర్ 29న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో హీరోయిన్ మానస చౌదరి విలేకరుల సమావేశంలో చిత్ర విశేషాలని పంచుకున్నారు. నేను చిత్తూరు జిల్లా పుత్తూరులో పుట్టాను. చెన్నైలో పెరిగాను. నాన్న బిజినెస్ చేస్తారు. నాకు ఎలాంటి సినిమా నేపథ్యం లేదు. పరిశ్రమలోకి వెళ్తానని చెప్పినపుడు ఫ్యామిలీ చాలా సపోర్ట్ చేసింది. చదువు పూర్తయిన తర్వాత మోడలింగ్ స్టార్ట్ చేశాను. ఒక స్నేహితుడి ద్వారా దర్శకుడు రవికాంత్ గారికి నా ప్రొఫైల్ సెండ్ చేశాను. ఆయనకి నచ్చి టీం నుంచి నాకు కాల్ వచ్చింది. తర్వాత ఫోటో షూట్ చేశాం. అలా జర్నీ మొదలైయింది. రవికాంత్ అండ్ టీం చాలా సరదాగా వుంటారు. బబుల్‌గమ్ కథ లవ్, రెస్పెక్ట్ గురించి వుంటుంది. సినిమా యూనిట్ కూడా నాపై ఎంతో ఆప్యాయత, గౌరవాన్ని చూపించింది. సెట్ లో చాలా కంఫర్టబుల్ గా చూసుకున్నారు. మోడలింగ్ వలన నాకు కెమరా ఫియర్ లేదు. సినిమా విషయానికి వస్తే దర్శకుడి విజన్ కి న్యాయం చేస్తున్నానా లేదా అనే దానిపైనే ద్రుష్టి పెట్టాను. రవికాంత్ ఈ కథ చెప్పినపుడు చాలా నచ్చింది. 22 ఏళ్ల ఏజ్ గ్రూప్ వాళ్ళు ఎలా ఉంటారో అలానే అనిపించింది. చాలా రియలిస్టిక్ గా వుండే కథ. ఇందులో వుండే సన్నివేశాలని బోల్డ్ అనడం కంటే చాలా బ్యూటీఫుల్ గా ప్రజెంట్ చేశారని చెప్పాలి. ఇందులో జాన్వి పాత్రలో కనిపిస్తా. తను ఫ్యాషన్ డిజైనర్. దర్శకుడు ఈ పాత్రకు సహజంగా కనిపించే నటులనే ఎంపిక చేసుకున్నారు. ఇందులో రియల్ లైఫ్ కి దగ్గరగా వున్న పాత్రలనే తీసుకున్నారుజాన్వీ పాత్ర ప్రేక్షకులకు నచ్చుతుందనే నమ్మకం వుంది. అలాగే రోషన్ నుంచి కూడా చాలా నేర్చుకున్నాను. సుమ గారు సినిమా చూశారు. చాలా బాగా చేశాని చెప్పారు. ట్రైలర్ టీజర్ చూసిన ఆడియన్స్ కూడా చాలా అందంగా, సహజంగా కనిపిస్తున్నాను ప్రశంసించారు.



హీరోయిన్ మానస చౌదరి :